JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । గురువారం 16-07-2026
Medchal - Malkajgiri । Thursday 16-07-2026
Follow: jayabherinews
సంపుటి : 03 । సంచిక : 45
పేజీలు : 8 । వెల : 5
Vol. 03 । Issue 45 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889
call me

jayabheripaper@gmail.com

# అమెరికా.. ఇరాన్ యుద్ధ మేఘాలు



- **పగటిపూటే ఇరాన్‌పై డ్రోన్ల దాడులు**
- **వచ్చే వారం మరింత భీకరంగా.. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్**

**జయభేరి, న్యూఢిల్లీ:**

పశ్చిమాసియాలో యుద్ధ ఉద్రిక్తతలు మరోసారి పీక్ స్టేజ్‌కు చేరుకున్నాయి. అమెరికాఇరాన్ దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు నానాటికీ తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన తాజా హెచ్చరికలు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. శాంతి చర్చలకు టెహ్రాన్ సహకరించకపోతే, వచ్చే వారం నుంచి సైనిక దాడుల తీవ్రతను మరింత పెంచుతామని ట్రంప్ (Iran vs US)స్పష్టం చేశారు. సిచువేషన్ రూమ్‌లో ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన మీడియా వేదికగా ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. అధ్యక్షుడు ట్రంప్ ప్రకటన వెలువడిన కొద్ది సేపటికే అమెరికా సైన్యం ఇరాన్‌పై పగటిపూట దాడులతో విరుచుకుపడింది. సాధారణంగా రాత్రి సమయాల్లో దాడులు చేసే యూఎస్ బలగాలు, ఈసారి వ్యూహాత్మకంగా పగటిపూటే ఇరాన్ లక్ష్యాలపై డ్రోన్లతో దాడి చేయడం గమనార్హం. హర్మూజ్ జలసంధి, ఇరాన్ తీర ప్రాంతాల్లోని టెహ్రాన్ సైనిక మౌలిక సదుపాయాలు, రక్షణ, క్షిపణి స్థావరాలే లక్ష్యంగా గ్రేటర్ తున్బ్ ద్వీపంపై ఈ దాడులు జరిగాయని యూఎస్ సెంట్రల్ కమాండ్ అధికారికంగా ప్రకటించింది.


**నౌకల రక్షణే ధ్యేయంగా యూఎస్ వ్యూహం:**

అంతర్జాతీయ జలాల్లో, ముఖ్యంగా హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు చేయకుండా అడ్డుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని అగ్రరాజ్యం స్పష్టం చేసింది. ఇరాన్ యొక్క సైనిక సామర్థ్యాలను, క్షిపణి నిల్వలను పూర్తిగా దెబ్బతీసి నౌకల రాకపోకలకు భద్రత కల్పించేందుకే ఈ దాడులు చేపట్టినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. అమెరికా తాజా చర్యలతో పశ్చిమాసియాలో ఏ క్షణంలోనైనా పూర్తిస్థాయి యుద్ధం ముంచుకొచ్చేలా పరిస్థితులు మారాయి.



## మీకు వచ్చిన వస్తువులు బాగున్నాయా?

7 లో



# ఆదర్శవంతమైన జిల్లాగా అభివృద్ధి చేసుకుందాం

- **పెట్టుబడులను ఆకర్షించడానికి తెలంగాణ రైజింగ్2047 లక్ష్యాలను నిర్దేశించాం**
- **తెలంగాణ రైజింగ్ విజన్‌కు అమర రాజా సంస్థ మద్దతుగా నిలవాలి**

**జయభేరి, హైదరాబాద్ :**

మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజా సంస్థ గిగా కారిడార్‌లో స్థాపించిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ (CQP) తయారీ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "కృష్ణా పరివాహక ప్రాంతంలో నిర్మాణ దశలో ఉన్న దిండి, పాలమూరు - రంగారెడ్డి, కల్వకుర్తి, బీమా నెట్టెంపాడు, కోయిల్ సాగర్, ఆర్డీఎస్ ప్రాజెక్టులను పూర్తి చేసుకోవడానికి, సమస్యలను పరిష్కరించుకోవడానికి పక్క రాష్ట్రంతో సంప్రదింపులు జరుపుతున్నాం" అని చెప్పారు. "ఈ ప్రాజెక్టులకు సంపూర్ణమైన అనుమతులను సాధించి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేసే బాధ్యత తీసుకుంటా. ఢిల్లీకి రాజైనా తల్లికి బిడ్డనే. నేను ఈ పాలమూరు జిల్లా వాడిగా అత్యంత వెనుకబడిన ఈ జిల్లాను అత్యంత అభివృద్ధి చెందిన ఆదర్శవంతమైన జిల్లాగా అభివృద్ధి చేసుకుందాం.." అని జిల్లా వాసులకు పిలుపునిచ్చారు. విద్య, నీటిపారుదల, పారిశ్రామాభివృద్ధికి సంబంధించి ప్రాధాన్యతగా పరిగణించి పాలమూరు జిల్లాలో ట్రిపుల్ ఐటీ, ఇంజనీరింగ్ కాలేజీలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, ప్రతి నియోజకవర్గానికి ఏటీసీలు తీసుకొచ్చినట్టు తెలిపారు. "పెట్టుబడులకు సంబంధించి గత ప్రభుత్వాలు అమలు చేసిన విధానాల్లో ప్రజాప్రయోజనాలకు అనుగుణంగా ఉంటే వాటిని మార్చకుండా మరింత మెరుగుపరిచి పాలసీలను తెచ్చాం. పెట్టుబడులను ఆకర్షించడానికి తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను నిర్దేశించాం. టూరిజం, ఎనర్జీ, మెడికల్, స్పోర్ట్స్ పాలసీను తీసుకొచ్చాం. తెలంగాణ రైజింగ్ విజన్‌కు అమర రాజా సంస్థ మద్దతుగా నిలవాలి.." అని కోరారు. "పారిశ్రామికంగా అభివృద్ధి సాధించడానికి పాలమూరు జిల్లాలో చాలా మంది రైతులు భూములు ఇచ్చారు. పరిశ్రమలు అత్యధిక ఉద్యోగాలు ఈ ప్రాంతం వారికే ఇవ్వాలి. చిన్న సహాయాన్ని కూడా జీవితాంతం గుర్తుపెట్టుకునే ఇక్కడ ప్రజలను అక్కున చేర్చుకోవాలి.." అని కోరారు. "వాతావరణంలో శరవేగంగా మార్పులొస్తున్నాయి. ఎల్‌నినో కారణంగా రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు. కాలుష్యాన్ని తగ్గించుకుని కాలుష్య రహిత దేశంగా ఈ దేశాన్ని తీర్చిదిద్దాలంటే వాహన కాలుష్యాన్ని నియంత్రించాలి. అందుకు ఈవీ వాహనాలను వినియోగం పెరగాలి. ఈవీ బ్యాటరీలు ప్రాధాన్యత పెరిగింది. ఈ నేపథ్యంలో 32 గిగాబైట్ సామర్థ్యం కలిగిన యూనిట్ అమర రాజా స్థాపించడం సంతోషం. అమర రాజా సంస్థలో 700 ఉద్యోగుల్లో 400 మంది మహిళలు ఉండటం గర్వకారణం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. "పాలమూరు జిల్లాలో నూతనంగా పరిశ్రమను ఏర్పాటు చేసి, స్థానిక నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి ప్రయత్నం చేస్తున్న అమర రాజా యాజమాన్యాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. 1983లో

...మిగతాది 2 లో



**పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి తొందర్లోనే శుభవార్త వినబోతున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ ప్రాజెక్టు కింద 90 టీఎంసీల నీటి వినియోగానికి కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలను ఒప్పించి అనుమతులు సాధించే దిశగా ముందుకు వెళుతున్నట్టు ప్రకటించారు. డిండి ప్రాజెక్టుకు సంబంధించి 30 టీఎంసీల నీటి కేటాయింపులపైన కూడా సంప్రదింపులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.**

## అమరావతి, హైదరాబాద్ లో హైటెక్ రైల్వేస్టేషన్లు ప్రధాని మోదీ ప్రారంభం

**జయభేరి, న్యూఢిల్లీ:**



రైల్వే శాఖ తెలుగు రాష్ట్రాల ప్రయాణీకులకు బిగ్ అప్డేట్ అందిస్తోంది. అమరావతి.. హైదరాబాద్ కేంద్రంగా రీ డెవలప్‌మెంట్ చేసిన రైల్వే స్టేషన్ల ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ప్రధాని మోదీ వీటిని ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా అమృత్ భారత్ పథకం కింద రీ డెవలప్‌మెంట్ చేసిన మొత్తం 75 రైల్వేస్టేషన్లను ప్రధాని ఒకేసారి వర్చువల్ పద్ధతిలో జాతికి అంకితం చేస్తారు. ఈ స్టేషన్లు పూర్తిగా హైటెక్ సదుపాయాలతో ఏయిర్ పోర్టు లుక్ లో తీర్చి దిద్దారు. ఏపీ, తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా తీర్చి దిద్దిన రైల్వే స్టేషన్లను ప్రధాని మోదీ ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారైంది. హైదరాబాద్ లోని హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్‌ను మొత్తం రూ.26 కోట్ల వ్యయంతో పునరాభివృద్ధి చేశారు. ఈ రైల్వే స్టేషన్ హైటెక్‌సిటీతో పాటు గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ ఐడీ కారిడార్‌కు దగ్గరగా ఉంది. దీంతో ప్రతి రోజూ వేలాదిమంది ఉద్యోగులు, ప్రయాణికు లు ఈ స్టేషన్ నుంచి రాకపోకల కొనసాగిస్తుండటంతో కీలకంగా మారింది. ప్రతి రోజూ ఏకంగా 62 ఎంఎంటీఎస్, సబర్బన్ రైళ్లు ఈ హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ నుంచి వెళుతుంటాయి. ఇప్పటికే స్టేషన్‌లో ఉన్న రెండు లిఫ్టులకు అదనంగా మరో రెండు లిఫ్టులు, ప్రధాన ప్రవేశద్వారం అభివృద్ధి, కొత్త ఓవర్ బ్రిడ్జి, వెయిటింగ్‌హాల్, కొత్తగా టాయిలెట్లు, కొత్త స్టేషన్ భవనం నిర్మించారు. హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు అవసరమైనా ఆధునిక సౌకర్యాలు కల్పించారు. అదే విధంగా జంట నగరాలతో పాటుగా తెలంగాణలోని మరి కొన్ని స్టేషన్లలో ఆధునీకరణ పనులు కొనసాగుతున్నాయి.

...మిగతాది 2 లో



2 లో

## రైతన్నకు భరోసా..

**కృష్ణమ్మకు జల హారతి వేళ సీఎం చంద్రబాబు**

## నేటి నుంచే బోనాలు

- **వారికి పోలీసులు కీలక వార్నింగ్..**

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణలో బోనాల పండగకు వేళ అయింది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బోనాల పండగ నిలుస్తూ వస్తోంది. రేపటినుంచి అంటే జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు బోనాల పండగ ఘనంగా జరగనుంది.

2 లో



మొదటిపేజీ తరువాయి

## ఆదర్శవంతమైన జిల్లాగా అభివృద్ధి చేసుకుందాం

అమర రాజా యాజమన్యం చిత్తూరులో ప్రారంభించి, దాదాపు 40 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరుణంలో బయట రాష్ట్రం, మహబూబ్‌నగర్ జిల్లాలో పెట్టడం మనకందరికీ గర్వకారణం. అమర రాజా సంస్థ ప్రపంచంతో పోటీపడే సంస్థ. లోకల్ టాలెంట్ తో గ్లోబల్ సంస్థలతో పోటీ పడుతున్న అమర రాజా సంస్థతో పోటీ పడే సంస్థ ఈ దేశంలో ఏదీ లేదు. చైనా, జపాన్, జర్మనీతో.. కొన్ని అంశాల్లో సౌత్ కొరియాతో పోటీపడుతుంది. దేశాలనే ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్తోంది" అని అమర రాజా సంస్థను అభినందించారు. "ప్రపంచంలో ఎంత అభివృద్ధి చెందిన దేశమైనా, ఈవీ బ్యాటరీలు, ఈవీ వాహనం కావాలన్నా, ఈవీకి సంబంధించిన ఏ ఉత్పత్తయినా చైనా మీద ఆధారపడుతుంది. చైనా లీడర్ ఆఫ్ ఈవీ ప్రొడక్ట్స్. అలాంటి దేశంతో పోటీపడటానికి ప్రయత్నం చేస్తున్న అమర రాజా యాజమాన్యాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.." అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## నేటి నుంచే బోనాలు

హైదరాబాద్ సికింద్రాబాద్ జంట నగరాల్లో బోనాల ఉత్సవాలు జరుగనున్న నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు ఆలయాలకు తరలివచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ అధికారులను ఆదేశించారు. ఈ పండుగను భక్తులు అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో జరుపుకొనేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచనలు చేశారు. గోల్కొండ, బల్కంపేట, సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి, లాల్ దర్వాజ తదితర ఆలయాల్లో జరిగే బోనాల ఉత్సవాల బందోబస్తు ఏర్పాట్లపై తాజాగా వీసీ సజ్జనార్ సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న భద్రతా చర్యలను ఈ సందర్భంగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో మాట్లాడుతూ.. గోల్కొండ బోనాలతో ప్రారంభమయ్యే ఈ ఉత్సవాల్లో భాగంగా రాబోయే 15 రోజులు అత్యంత కీలకమని గుర్తు చేశారు. ఆయా ఆలయాల వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పండగ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా టాస్క్ ఫోర్స్, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, సిటీ ఆర్మ్డ్ రిజర్వ్, క్విక్ రియాక్షన్ టీమ్స్ తో పాటు స్థానిక పోలీసులను భారీగా మోహరిస్తున్నట్లు వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు భక్తులకు అవసరమైన సమాచారాన్ని చేరవేసేందుకు వీలుగా ఆలయాల పరిసరాల్లో పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని తెలిపారు. బోనాల పండగకు మహిళలు పెద్ద సంఖ్యలో తరలివస్తారని వారి భద్రతకు హైదరాబాద్ సిటీ పోలీస్ అత్యంత ప్రాధాన్యమిస్తుందని స్పష్టం చేశారు. గొలుసు దొంగతనాలు, మొబైల్ స్నాచింగ్, జేబు దొంగతనాలు, ఈవ్ టీజింగ్ వంటి నేరాలకు ఆస్కారం లేకుండా నివారణా చర్యలు చేపట్టాలని సూచనలు చేశారు. అలాగే ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

## రైల్వేస్టేషన్లు ప్రధాని మోదీ ప్రారంభం

**17న రైల్వే స్టేషన్ల ప్రారంభోత్సవం**

ఇక, అమరావతికి సింహద్వారంగా భావించే మంగళగిరి నియోజకవర్గంలో మరో కీలకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టు పూర్తయింది. దాదాపు రూ. 12.56 కోట్ల భారీ బడ్జెట్ తో అత్యాధునిక హంగులతో పునర్నిర్మించిన మంగళగిరి రైల్వే స్టేషన్ పనులు పూర్తి చేసుకుని ప్రారంభోత్సవానికి సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. ప్రయాణికులకు విమానాశ్రయ స్థాయి అనుభూతిని కలిగించేలా రీడెవలప్మెంట్ పనులను విజయవంతంగా పూర్తి చేశారు. రూ. 12.56 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ ఆధునీకీకరణలో భాగంగా స్టేషన్ ముఖద్వారాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారు. ప్రయాణికుల సౌకర్యార్థం విశాలమైన వెయిటింగ్ హాళ్లు, ఆధునిక బుకింగ్ కౌంటర్లు, కొత్త ప్లాట్ ఫారాలు, ఎస్కలేటర్లు, లిఫ్ట్ సదుపాయాలతో పాటు డిజిటల్ డిస్ ప్లే బోర్డులు.. స్టేషన్ పరిసరాలలో ఆకట్టుకునేలా పచ్చదనంతో కూడిన సుందరీకరణ పనులు చేపట్టారు. అదే విధంగా విజయవాడ శివారు లోని రాయనపాడు స్టేషన్ ను తీర్చి దిద్దారు. వీటిని ఈ నెల 17న ప్రధాని మోదీ వర్చ్యువల్ గా ప్రారంభించి.. ప్రయాణీకులకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

## ఎన్యూమరేషన్ ఫారంల సమర్పణకు సమీపించిన గడువు

- త్వరితగతిన ఫారంలను బీ.ఏల్.ఓలకు అందజేయాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి



జయభేరి, నిజామాబాద్, జూలై 15 :

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారంల సమర్పణకు గడువు ముగియనున్న నేపథ్యంలో ఓటర్లు త్వరితగతిన తమ ఫారంను బీ.ఎల్.ఓలకు అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. వివరాలను డిజిటలైజ్ చేయాల్సి ఉందన్నారు. అంతేకాకుండా ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్/డిలీటెడ్ (ఏ.ఎస్.డీ)ఓటర్ల జాబితాను సైతం రూపొందించాల్సి ఉన్నందున చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటదివెంట ఎన్యూమరేషన్ ఫారాలను బీ.ఎల్.ఓలకు అందించాలని అన్నారు. ప్రత్యేకించి నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గం పరిధిలోని ఓటర్లు ఫారం అందజేసే విషయంలో తాత్సారం చేయవద్దని సూచించారు. ఎన్యూమరేషన్ ఫారం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే ఓటరు జాబితా నుండి పేరు గల్లంతు అవుతుందని తెలిపారు. ఒకవేళ ఎవరికైనా గత 2002 ఎస్ఐఆర్ వివరాలు తెలియకపోతే సర్కిల్ వారీగా నెలకొల్పిన హెల్ప్ డెస్క్ ను, లేదా బీఎల్ఓ లను సంప్రదించాలని సూచించారు. అయినప్పటికీ వివరాలు తెలియని పక్షంలో ప్రస్తుత ఓటరు జాబితా వివరాలు పొందుపరచి ఫారం సమర్పించవచ్చని అన్నారు. అలాంటి వారి పేరు కూడా ముసాయిదా ఓటరు జాబితాలో చేర్చబడుతుందని తెలిపారు. వారికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఈ.ఆర్.ఓ) నోటీసు జారీ చేసే హియరింగ్ కు పిలుస్తారని, ఎన్నికల సంఘం నిర్దేశించిన 13 రకాల గుర్తింపు ధృవీకరణ పత్రాలలో ఏదైనా ఒక దానిని చూపిస్తే ఓటరు తుది జాబితాలో పేరు చేరుస్తారని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఓటరు తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారం అందజేయాలని కలెక్టర్ సూచించారు. ఈ విషయంలో బూత్ లెవెల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో ఉంటూ క్రియాశీలక పాత్ర పోషించాలని, ప్రతి రోజు ఓటర్ల నుండి 50 చొప్పున ఫారంలు సేకరించి బీ.ఎల్.ఓలకు అందించేలా చొరవ చూపాలన్నారు. ఈ.ఆర్.ఓలు, ఏ.ఈ.ఆర్.ఓలు కూడా క్షేత్రస్థాయిలో ఉంటూ, ఎన్యూమరేషన్ ఫారంల సేకరణ, వాటి డిజిటలైజేషన్ ప్రక్రియలు వేగవంతం అయ్యేలా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా అందుబాటులో లేని, చనిపోయిన, శాశ్వతంగా వలస వెళ్ళిన, రెండు చోట్ల ఓటు కలిగిన ఓటర్ల పేర్లను గుర్తిస్తూ పక్కాగా జాబితాను రూపొందించి, వాటిపై బీ.ఎల్.ఏల సంతకాలు తీసుకోవాలన్నారు.

# వన్ నేషన్-వన్ ఎలక్షన్




భారత రాజకీయ యవనికపై అత్యంత భారీ మార్పులకు కేంద్ర ప్రభుత్వం వేదిక సిద్ధం చేస్తోంది. ఒకేసారి మూడు చారిత్రాత్మక సంస్కరణలను అమల్లోకి తెచ్చేందుకు చట్టసభల్లో ముమ్మర ప్రయత్నాలు సాగుతున్నాయి. వన్ నేషన్‌వన్ ఎలక్షన్ , నియోజకవర్గాల పునర్విభజన , మహిళా రిజర్వేషన్ల తక్షణ అమలు కోసం పార్లమెంట్ లో ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణ బిల్లులు దేశ ప్రజాస్వామ్య వ్యవస్థ రూపురేఖలను సంపూర్ణంగా మార్చేయబోతున్నాయి. ఈ మూడు బిల్లుల కలయిక కేవలం ఎన్నికల సంస్కరణ మాత్రమే కాదు, ఇది భారత ఫెడరల్ నిర్మాణాన్ని, ప్రాతినిధ్య రాజకీయాలను సరికొత్త దిశకు తీసుకెళ్లే ఒక సుదీర్ఘ ప్రయాణం.దేశవ్యాప్తంగా లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలనే వన్ నేషన్‌వన్ ఎలక్షన్ బిల్లు భారత ఎన్నికల నిర్వహణ వ్యయాన్ని, శ్రమను భారీగా తగ్గించడమే లక్ష్యంగా తెస్తున్నారు. పార్లమెంటరీ సంయుక్త కమిటీ అంచనాల ప్రకారం.. నిరంతరం ఎక్కడో ఒకచోట ఎన్నికలు జరగడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు దాదాపు 7 లక్షల కోట్ల నష్టం వాటిల్లుతోంది. ఒకేసారి ఎన్నికలు జరగడం వల్ల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ వల్ల నిలిచిపోయే అభివృద్ధి పనులకు విముక్తి లభిస్తుంది. అయితే, మధ్యలో ఏదైనా రాష్ట్ర ప్రభుత్వం పడిపోతే, అక్కడ కొత్తగా ఎన్నికయ్యే సభ కేవలం మిగిలిన కాలపరిమితి కి మాత్రమే పరిమితం అవుతుందనే ప్రతిపాదన ప్రాంతీయ పార్టీలలో కొంత ఆందోళన కలిగిస్తోంది. ఈ విధానాన్ని 2029 కల్లా పూర్తి స్థాయిలో అమల్లోకి తేవాలని కేంద్రం గట్టి పట్టుదలతో ఉంది.1971 జనాభా లెక్కల ఆధారంగా స్తంభింపజేసిన లోక్‌సభ స్థానాల పరిమితిని సవరించి, నియోజకవర్గాల పునర్విభజనను చేపట్టేందుకు కేంద్రం సిద్ధమైంది. దీని కోసం ప్రతిపాదించిన చట్టాల ప్రకారం.. లోక్‌సభ గరిష్ట స్థానాల సంఖ్యను 550 నుండి ఏకంగా 850కి పెంచే అవకాశం ఉంది.

ఎవరికీ అన్యాయం జరగకుండా యాభై శాతం సీట్ల ఫార్ములాను తీసుకు వచ్చింది. గతంలో ఆమోదం పొందిన మహిళా రిజర్వేషన్ చట్టం అమలు కావాలంటే జనాభా లెక్కలు, పునర్విభజన పూర్తి కావాలనే నిబంధన ఉండేది. కానీ, తాజా 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ద్వారా ఈ ప్రక్రియను వేగవంతం చేసి, అందుబాటులో ఉన్న డేటా ఆధారంగానే మహిళా కోటాను తక్షణమే అమల్లోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీని వల్ల రాబోయే 2029 సాధారణ ఎన్నికల నాటికి లోక్‌సభ ,రాష్ట్రాల అసెంబ్లీలలో 33 శాతం స్థానాలు మహిళలకే దక్కుతాయి. ఇది భారత రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యాన్ని క్రింది స్థాయి నుండి అగ్రస్థాయి వరకు అనూహ్యంగా పెంచే విప్లవాత్మక మార్పు కానుంది.ఈ మూడు మహా బిల్లులు ఒకదానితో ఒకటి ముడిపడి ఉన్నాయి. పునర్విభజన జరిగితేనే పెరిగిన సీట్లలో మహిళా రిజర్వేషన్లు పక్కాగా అమలవుతాయి, ఆ సీట్ల ఆధారంగానే వన్ నేషన్‌వన్ ఎలక్షన్ నిర్వహించాల్సి ఉంటుంది. అయితే, ఈ స్థాయి భారీ రాజ్యాంగ సవరణలు కేవలం పార్లమెంట్‌లో సాధారణ మెజారిటీతో సాధ్యం కాదు. దీనికి రెండు పద్ధతుల ప్రత్యేక మెజారిటీ తో పాటు కనీసం సగం రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం తప్పనిసరి. ప్రాంతీయ పార్టీలను ఒప్పించడం, దక్షిణాది రాష్ట్రాల హక్కులను కాపాడటం, ఒకేసారి దేశవ్యాప్తంగా ఈవీఎంల సరఫరా వంటి భారీ లాజిస్టికల్ సవాళ్లు కేంద్రం ముందున్నాయి.

లోక్‌సభ, అసెంబ్లీలకు కలిపి దేశం మొత్తం ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే.. భారీగా ప్రభుత్వ ధనం వృథా తగ్గి.. ఖర్చులు కలిసి వస్తాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. దీంతో పాటు ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని కూడా సమర్థవంతంగా ఉపయోగించుకునే అవకాశం ఉంటుందనే వాదనలు వినిపిస్తున్నాయి. సాధారణంగా అధికారులు ఎన్నికల విధుల్లో పూర్తిగా నిమగ్నమై ఉంటే పరిపాలనపై ప్రభావం పడుతుంది.. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికలు ఒకేసారి నిర్వహిస్తే.. సమయం ఆదాతో పాటు రెండుసార్లు ఎన్నికలు జరగకుండా వారు పరిపాలనపై దృష్టి పెట్టడానికి అవకాశం ఉంటుంది. దీంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుకు తరచూ ఎన్నికల కోడ్ అడ్డంకిగా మారడం కూడా తగ్గుతుంది. ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఓటర్లు ఒకేసారి వచ్చి ఓటింగ్ వేయడం వల్ల పోలింగ్ శాతం కూడా పెరుగుతుందని లా కమిషన్ వెల్లడించింది.అయితే ఈ జమిలీ ఎన్నికలు నిర్వహించాలంటే ముందుగా కొన్ని రాజ్యాంగ సవరణలు చేయాల్సి ఉంటుంది. ప్రజా ప్రాతినిధ్య చట్టం సహా ఇతర పార్లమెంటరీ ప్రొసీజర్లను కూడా సవరించాల్సి ఉంటుంది. దీని కోసం రాష్ట్రాల అంగీకారం కూడా కావాల్సి ఉంటుంది.

ఒకే దేశం ఒకే ఎన్నిక అమల్లోకి వస్తే ప్రచారంలో జాతీయ అంశాలే అధిక ప్రాధాన్యత కలిగి ఉండి.. స్థానిక అంశాలు, సమస్యలు కనిపించకుండా పోతాయని ప్రాంతీయ పార్టీలు తీవ్రంగా భయపడుతున్నాయి. దీనికి తోడు ఎన్నికల ఖర్చులో కూడా జాతీయ పార్టీలతో ప్రాంతీయ పార్టీలు పోటీపడాల్సి రావడం మరింత ఇబ్బందిగా ఉంటుందని భావిస్తున్నాయి. అయితే 2015లో నిర్వహించిన ఓ సర్వే ప్రకారం.. దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహిస్తే 77 శాతం మంది ప్రజలు ఒకే పార్టీ లేదా కూటమికి ఓటు వేయనున్నారని తేలింది. అసెంబ్లీకి పార్లమెంట్‌కు వేర్వేరుగా నిర్వహిస్తే ఒకే పార్టీని ఎన్నుకొనే అవకాశాలు 61శాతానికి తగ్గినట్లు వెల్లడైంది.స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1967 వరకు దేశంలోని అన్ని రాష్ట్రాలకు, లోక్‌సభకు ఒకేసారి ఎన్నికలు జరిగేవి. ఆ తర్వాత కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలు రద్దు కావడం, 1970 లో ఏడాది ముందే లోక్‌సభ రద్దు చేయడంతో ఈ విధానం మారిపోయింది. అయితే 1983 లో ఎన్నికల కమిషన్ మరోసారి జమిలీ ఎన్నికల ప్రతిపాదనను తెరపైకి తెచ్చినా.. ప్రభుత్వం ఆసక్తి చూపలేదు. 1999 లో లా కమిషన్ నివేదిక ఒకే దేశం ఒకే ఎన్నిక విధానాన్ని లేవనెత్తినా అది ఆచరణలోకి రాలేదు. 2016 లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ జమిలీ ఎన్నికల ఆలోచనను ప్రతిపాదించగా.. 2017 లో నీతి ఆయోగ్ కసరత్తు చేసింది. 2019 లో ఈ అంశంపై వివిధ పార్టీల నేతలతో ప్రధాని మోదీ సమావేశం ఏర్పాటు చేయగా.. కాంగ్రెస్ సహా చాలా ప్రతిపక్షాలు హాజరు కాలేదు. అయితే 2022 లో జమిలీ ఎన్నికల నిర్వహణకు తాము సిద్ధమేనని సీఈసీ సుశీల్ చంద్ర ప్రకటించారు. 2022 డిసెంబర్‌లో జమిలీ ఎన్నికలపై లాకమిషన్ వివిధ పార్టీలు, ఈసీ, అధికారులు, విద్యావేత్తలు, నిపుణుల అభిప్రాయాలను ఆహ్వానించింది.ఇవన్నీ దాటుకుని బిల్లులు చట్ట రూపం దాలిస్తే, భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఇది సరికొత్త అధ్యాయం అవుతుంది. అయితే దీనికి సంబంధించిన బ్యాక్ గ్రౌండ్ వర్క్ ను ఎన్డీఏ పెద్దలు ఇప్పటికే పూర్తి చేసినట్లుగా తెలుస్తోంది.

## రైతన్నకు భరోసా..

- కృష్ణమ్మకు జల హారతి వేళ సీఎం చంద్రబాబు
- పట్టిసీమ వల్లే రాయలసీమకు నీళ్లు.. కృష్ణా డెల్టా స్థిరీకరణ
- గత పాలకుల నిర్లక్ష్యం 'రాష్ట ద్రోహం'..
- రూ. 35 వేల కోట్లతో.. వచ్చే మూడేళ్లలో 36 ప్రాజెక్టుల పూర్తి!

జయభేరి, విజయవాడ, జూలై15 :



రాష్ట్ర సాగునీటి రంగానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును వచ్చే 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. పోలవరం పూర్తయితే గ్రావిటీ ద్వారానే నేరుగా నీరు అందుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కృష్ణాగోదావరి నదుల పవిత్ర సంగమ ప్రాంతమైన ఇబ్రహీంపట్నం వద్ద బుధవారం జరిగిన ప్రముఖ ఇంజనీర్ డాక్టర్ కేఎల్ రావు 124వ జయంతి ఉత్సవాల్లో ముఖ్యమంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేఎల్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సభలో కేఎల్ రావు కుమారుడు కేఎల్ విజయరావుతో పాటు మంత్రులు నిమ్మల రామానాయుడు, సత్యకుమార్ యాదవ్, అనగాని సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తూ.. సాగునీటి రంగానికి మహోన్నత సేవలు అందించిన కేఎల్ రావు స్ఫూర్తిని ప్రతీ గ్రామానికీ తీసుకెళ్లేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. "విజయవాడ గడ్డపై పుట్టి, ఎంపీగా గెలిచి.. ముగ్గురు ప్రధానుల వద్ద కేంద్రమంత్రిగా పనిచేసిన ఘనత కేఎల్ రావుది. శ్రీశైలం, నాగార్జున సాగర్, హీరాకుడ్, కోసీ లాంటి ప్రతిష్టాత్మక డ్యామ్‌ల నిర్మాణంలో ఆయన పాత్ర మరువలేనిది. ఐక్యరాజ్యసమితి తరపున అంతర్జాతీయ జల నిపుణుడిగా ఈజిప్ట్, సూడాన్ వంటి దేశాలకూ ఆయన సేవలందించారు. బ్రిటీష్ కాలంలో సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం బ్యారేజీ, కృష్ణా బ్యారేజీలు నిర్మిస్తే.. స్వతంత్ర భారతంలో వాటిని ఆధునీకరించి తెలుగు నేలను సస్యశ్యామలం చేసింది కేఎల్ రావు గారే. వారి తర్వాత ఎన్టీఆర్ సాగునీటి రంగాన్ని ఎంతగానో తీర్చిదిద్దారు. వీరంతా నాకు నిత్య స్ఫూర్తిప్రదాతలు" అని సీఎం కొనియాడారు. గతంలో పట్టిసీమ ప్రాజెక్టును కొందరు 'వట్టిసీమ' అంటూ అవహేళన చేశారని, ప్రాజెక్టు దండగ అన్నారని చంద్రబాబు గుర్తుచేశారు. "2014లో విభజన కష్టాల్లో ఉన్నప్పుడు బస్సులోనే బస చేసి, కృష్ణా డెల్టాను కాపాడటానికి పట్టిసీమ ప్రారంభించాం. 80 టీఎంసీల గోదావరి నీటిని తెచ్చి కృష్ణా డెల్టాను రక్షించాం. నీల వర్ణంలోని కృష్ణా జలాలు, అరుణ వర్ణంలోని గోదావరి జలాలు పవిత్ర సంగమంలో కలిసి ఈ ప్రాంతంలో బంగారం పండించాయి. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టా స్థిరీకరణ జరగడం వల్లే.. శ్రీశైలంలో నీటిని పొదుపు చేసుకుని, ఆ నీటిని రాయలసీమ ప్రాంతానికి తరలించే వీలు కలిగింది. 2015 నుంచి 2025 వరకు పట్టిసీమ ద్వారా 450 టీఎంసీల నీటిని తరలించాం. దీనికోసం మనం ఖర్చు పెట్టింది కేవలం రూ. 1300 కోట్లు మాత్రమే" అని లెక్కలతో వివరించారు. గత ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. "గత పాలకులు అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోయినా పట్టించుకోలేదు. గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకుపోయినా మాట్లాడలేదు. ప్రాజెక్టుల నిర్వహణకు కనీసం గ్రీజు పూయడానికి కూడా పైసా ఇవ్వలేదు. అత్యంత కీలకమైన ప్రాజెక్టుల పట్ల నిర్లక్ష్యం వహించడం దేశ ద్రోహం, రాష్ట్ర ద్రోహం కిందకే వస్తుంది. 201419 మధ్య పోలవరంలో 72 శాతం పనులు పూర్తి చేస్తే.. గత ఐదేళ్లలో కనీసం 2 శాతం పనులు కూడా చేయకుండా డయాఫ్రామ్ వాల్ దెబ్బతినేలా చేశారు. నేను నేరుగా 37 సార్లు పోలవరాన్ని సందర్శించి, 136 సార్లు సమీక్షించాను. ప్రస్తుతం ప్రాజెక్టు 89 శాతం మేర పూర్తయింది. నిర్వాసితులకు రూ. 2,250 కోట్లు చెల్లించాం" అని వివరించారు. రాష్ట్రంలో నీటి వనరుల వినియోగం, ప్రాజెక్టుల భవిష్యత్తుపై సీఎం చంద్రబాబు పలు కీలక ప్రకటనలు చేశారు. ప్రాధాన్యతా క్రమంలో ఉన్న 36 సాగునీటి ప్రాజెక్టులను వచ్చే మూడేళ్లలో రూ. 35 వేల కోట్లు ఖర్చు చేసి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. "తుంగభద్ర డ్యామ్‌కు కొత్త గేట్లు ఏర్పాటు చేయించాం. ధవళేశ్వరం బ్యారేజీకి కూడా రూ. 152 కోట్లతో కొత్త గేట్ల ఏర్పాటు పనులు ప్రారంభించాం. వచ్చే ఏడాదికి ఈ పనులు పూర్తవుతాయి. గుంటూరు ఛానల్ ఆధునీకరణకు ఈ నెలలోనే శంకుస్థాపన చేసి, రెండేళ్లలో పూర్తి చేస్తాం. పోలవరం ఎడమ కాలువ పూర్తయింది. ఆగస్టు 14వ తేదీన గోదావరి జలాలకు అనకాపల్లి వద్ద అఖండ హారతి ఇచ్చి ఘనంగా స్వాగతం పలుకుతాం. పేరూరు బ్రాంచ్ కెనాల్‌కు 2026 ఆగస్టు 4న శంకుస్థాపన చేస్తాం. గత పాలకులు సొరంగంలో టన్నెల్ బోరింగ్ మిషన్ ఇరుక్కుపోయినా ప్రాజెక్ట్ ప్రారంభమంటూ నాటకాలు ఆడారు. ఆ మోసాన్ని అధిగమించి వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను 2026 సెప్టెంబరు 1న జాతికి అంకితం చేస్తాం. ప్రతి వర్షపు చుక్కనూ భూగర్భ జలంగా మార్చేందుకు 'జలధార' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టాం. గత ప్రభుత్వం నిలిపివేసిన పవిత్ర సంగమ హారతిని తిరిగి పునరుద్ధరిస్తామని" సీఎం చంద్రబాబు తెలియజేశారు. నదుల అనుసంధానమే భారత ప్రగతికి అసలైన సోపానమని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. గంగాకావేరి నదుల అనుసంధానం జరిగితే దేశ రూపురేఖలే మారిపోతాయని, రాష్ట్రంలో వంశధార నుంచి పెన్నా వరకు నదులను అనుసంధానించాలన్నదే తన లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

## ఉత్తర తెలంగాణ పోరాట గడ్డల నుండి కదలివచ్చిన ఉద్యమకారులు

- నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ముఖాముఖి విజయవంతం

జయభేరి, హైదరాబాద్, జూలై 15 :




తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు కమిటీ (జీవో నెం. 679) అధికారిక నిరంతరాయ షెడ్యూల్ ప్రకారం నేడు అమరవీరుల స్మారక చిహ్నం (అమరదీపం) లో ఉత్తర తెలంగాణ జిల్లాల పరిధిలోని నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, మరియు ఆదిలాబాద్ జిల్లాల క్షేత్రస్థాయి ఉద్యమకారులతో ముఖాముఖి సమీక్షా సమావేశాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించింది. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో కమిటీ చైర్మన్ డాక్టర్ కె. కేశవరావు, సభ్యులు ప్రొఫెసర్ ఎమ్. కోదండరామ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మోతె శోభన్ రెడ్డి, ఎస్. రాములు నాయక్ తదితరులు స్థాయిలో హాజరై, సుదూర ప్రాంతాల నుండి తరలివచ్చిన పోరాటయోధుల సలహాలను, సూచనలను, నాటి ఉద్యమ ఆధారాలను స్వయంగా పరిశీలించారు.

**స్వరాష్ట్ర సాధనలో సరిహద్దు జిల్లాలది "కీలక పాత్ర"**

ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. నిజామాబాద్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల ఉద్యమకారులు స్వరాష్ట్ర సాధనలో అత్యంత కీలకమైన పాత్ర పోషించారని కొనియాడారు. నాడు వివక్షకు వ్యతిరేకంగా అడవి బిడ్డల నుండి మొదలుకొని పట్టణ శ్రేణుల వరకు, విద్యార్థి లోకం, ఆర్టీసీ, సింగరేణి కార్మికులు సరిహద్దు జిల్లాల్లో రహదారులను స్తంభింపజేసి ఉద్యమాన్ని ఉధృతం చేశారని, ఆనాటి పోరాట పటిమే నేటి స్వరాష్ట్ర ఆవిర్భావానికి బలమైన పునాది అని ప్యానల్ స్పష్టం చేసింది.

# మీకు వచ్చిన వస్తువులు బాగున్నాయా?

- "రూ. 1000 కోట్లకుపైగా ఖర్చు పెట్టి, ఆగస్టు 15వ తేదీ లోపు రాష్ట్రంలోని 27.50 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ ఎడ్యుకేషన్ కిట్లు

**జయభేరి, హైదరాబాద్ :**




"ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు రేపటి తెలంగాణ పునర్నిర్మాణంలో అత్యంత కీలక పాత్ర పోషించాలి. పలుగు, పార పట్టిన చేతులే.. కలాలు పట్టి తెలంగాణ రాత మార్చాలి" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. "ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న అవకాశాలను పూర్తిగా సద్వినియోగం చేసుకోండి. చదువొక్కటే భవిష్యత్తును నిర్ణయిస్తుంది. మన జీవితాల్లో వెలుగులు నింపుతుంది. చదువే సమాజంలో ఆత్మగౌరవాన్ని పెంచుతుంది. తల్లిదండ్రుల కళ్లల్లో ఆనందం నింపుతుంది" అని విద్యార్థులకు ఉద్బోధించారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో బాలికల ఉన్నత పాఠశాల నూతన భవనానికి ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డితో పాటు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొద్దిసేపు విద్యార్థినులతో ముఖ్యమంత్రి ముచ్చటించారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆగస్టు 15 నాటికి 9 రకాల వస్తువులతో కూడిన కిట్లను అందిస్తామని ప్రకటించారు. "రూ. 1000 కోట్లకుపైగా ఖర్చు పెట్టి, ఆగస్టు 15వ తేదీ లోపు రాష్ట్రంలోని 27.50 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ ఎడ్యుకేషన్ కిట్లను ఇవ్వబోతున్నాం. అవి అందుకున్న తర్వాత.. మీకు వచ్చిన వస్తువులు బాగున్నాయా? లేదా వాట్సాప్ వేదికగా చెప్పడానికి విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది" అని తెలిపారు. "సరైన మౌలిక సదుపాయాలు లేక ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గింది. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయకపోతే వందేళ్లయినా సమస్య పరిష్కారం కాదు. అందుకే ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రభుత్వ పాఠశాల ప్రతిష్టను పెంచడానికి నిరంతరం పనిచేస్తున్నాం. కార్పొరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని శపథం తీసుకుని పనిచేస్తున్నా" అని పేర్కొన్నారు. "ఒకటి రెండేళ్లలో మొత్తం వ్యవస్థ బాగుపడుతుందని భావించడం లేదు. కొంత సమయం పడుతుంది. ప్రజాప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉపాధ్యాయులకు 16 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు, పదేండ్లుగా జరగని బదిలీలను చేపట్టాం. ప్రశాంతంగా చదువు చెబుతారన్న ఆలోచనతో 317 జీవోను అమలు చేసి చెదిరిపోయిన కుటుంబాలను ఒకచోట చేర్చాం. విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు కష్టపడుతున్నారు. అందుకే కేంద్ర విద్యా శాఖ ప్రకటించిన పర్‌ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ 36వ స్థానం నుంచి 18వ స్థానానికి ఎదిగాం. దీంతో సంతృప్తి చెందాల్సిన అవసరం లేదు. మొదటి రెండు స్థానాలు సాధించే వరకు నిరంతరం పనిచేయాలి. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ప్రతిభ కనబరిచిన టీచర్లకు అవార్డులు ఇవ్వాలని నిర్ణయించాం" అని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రపంచంలో మంచి విద్యావిధానం అమలు చేస్తున్న దేశాల్లో అధ్యయనం కోసం 50 మంది ఉపాధ్యాయులను విదేశాలకు పంపించామని, వచ్చే ఏడాది 150 మంది టీచర్లను పంపిస్తామని చెప్పారు. "ఏఐ విప్లవం వచ్చిన తర్వాత వైట్ కాలర్ జాబ్స్ పోయే ప్రమాదమొచ్చింది. అందుకే యువతలో స్కిల్స్ పెంచి బ్లూ కాలర్ జాబ్స్ అందించేలా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టింది. విద్యార్థులకు జర్మన్, జపనీస్ లాంటి భాషలను నేర్పించాలి. అవకాశాలను అందిపుచ్చుకోవాలి" అని కోరారు.

ఈ ప్రభుత్వ పాఠశాలలే తెలంగాణ నిర్మాణంలో అత్యంత క్రియాశీల పాత్ర పోషించాలి. ప్రభుత్వ పాఠశాలల నుండి వచ్చిన ఈ పిల్లలే డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు, సైంటిస్టులుగా రాణించాలన్నారు. చదువులో రాణించలేని వారు మైదానాల్లో రాణించాలని కోరారు. "క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది. ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం ఏటా రూ. 1.08 లక్షలు ఖర్చు పెడుతోంది. ఇంత మొత్తంలో ఖర్చు చేస్తున్నప్పుడు కచ్చితంగా బాగా చదువుకుని నిరూపించుకోవాలి" అని ఉద్బోధించారు.

# అమెజాన్ నిర్మిస్తున్న దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్

- భారత్ ఫ్యూచర్ సిటీలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన
- భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచంలోనే ఫార్చ్యూన్ 500 కంపెనీల పెట్టుబడులను ఆహ్వానించాలని లక్ష్యం
- 2034 నాటికి 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ ఎదగాలన్నది మా కల.. మా లక్ష్యం...

**జయభేరి, హైదరాబాద్ :**




2034 నాటికి నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే దిశగా తెలంగాణ ప్రయాణం ప్రారంభమైందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ప్రపంచంలోనే ఒక అద్భుతమైన నగరంగా భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మించాలన్న సంకల్పానికి అమెజాన్ నెలకొల్పుతున్న డేటా సెంటర్ తొలి మెట్టుగా నిలుస్తుందని అభివర్ణించారు. అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో భారత్ ఫ్యూచర్ సిటీ లో నిర్మించనున్న డేటా సెంటర్‌కు మంత్రి శ్రీధర్ బాబుతో పాటు ఇతర ప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. దేశంలోనే ఒక అభివృద్ధి చెందిన మోడల్ రాష్ట్రంగా తెలంగాణను నిలబెట్టడంలో అమెజాన్ భాగస్వామిగా నిలిచి 2034 నాటికి లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టాలని ముఖ్యమంత్రి కోరారు. డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "ఏ దిశగా అయితే భారత్ ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలని సంకల్పించామో, అమెజాన్ నిర్మిస్తున్న దేశంలోనే అతిపెద్ద డేటా సెంటర్ ఈ ప్రాంతంలో రాబోయే పరిశ్రమలకు ప్రోత్సాహకరంగా నిలుస్తుందని అన్నారు. "భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచంలోనే ఫార్చ్యూన్ 500 కంపెనీల పెట్టుబడులను ఆహ్వానించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చెప్పారు. ఆ ప్రయత్నంలో భాగంగానే 108 దేశాలకు చెందిన ప్రతినిధులు, 3 వేలకు పైగా కార్పొరేట్ దిగ్గజాలను ఆహ్వానించి తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌ను ఇక్కడ నిర్వహించాం. 2034 నాటికి 1 ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తెలంగాణ ఎదగాలన్నది మా కల. మా లక్ష్యం. దేశంలో 2.5 శాతం జనాభా ఉన్న తెలంగాణ ప్రస్తుతం దేశ జీడీపీకి 5 శాతం మేరకు తోడ్పాటును అందిస్తోందని, 2047 నాటికి 10 శాతం మేరకు అందించాలన్నది మా లక్ష్యం. లక్ష్యం నెరవేరాలంటే అందుకు పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉద్యోగావకాశాల కల్పన అవసరం. ఆ దిశగా లక్ష్యాలను నిర్దేశించుకుని తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాం. ఈ విజన్ రూపకల్పనలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో పాటు జాతీయ, అంతర్జాతీయ నిపుణుల సహకారం తీసుకున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు. "పెట్టుబడిదారుల్లో విశ్వాసం కల్పించడానికి సింగిల్ విండో పద్ధతిలో అన్ని అనుమతులు మంజూరు చేస్తున్నాం. 2025 డిసెంబర్‌లో రూపొందించిన పాలసీ మేరకు ఇప్పుడు అమెజాన్‌కు భూమి కేటాయించి ప్రభుత్వం చెప్పింది చేస్తుంది. 2034 లక్ష్యాలను చేరుకునే దిశగా ప్రయాణం మొదలైంది. వచ్చే 14 ఏండ్లలో 7 బిలియన్ డాలర్లను అమెజాన్ పెట్టుబడులు పెడుతోంది. ప్రభుత్వ సంకల్పం నెరవేరే దిశగా 1 లక్ష కోట్ల పెట్టుబడులు పెట్టాలి. అందుకు ప్రభుత్వ యంత్రాంగం అన్ని విధాలుగా అమెజాన్‌కు సహకరిస్తుంది. ఏది కావాలన్నా సమకూర్చుతాం. పెట్టుబడులపై ప్రతి నెలా సమీక్షిస్తాను" అని హామీ ఇచ్చారు. "ఒక లక్ష్యం నిర్దేశించుకున్న తర్వాత పాలసీలో పెరాలసిస్ రాకూడదు. అందుకే పెట్టుబడుల కోసం స్పష్టమైన పాలసీలు తెచ్చాం. టూరిజం, మెడికల్, స్పోర్ట్స్ పాలసీలు తెచ్చాం. అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని నడిపించాలన్న ఆలోచనతోనే ఈ పాలసీలు తెచ్చాం.

మా లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు, యంత్రాంగం కార్యోన్ముఖులై పనిచేస్తున్నారు. అమెజాన్ డేటా సెంటర్ తొలి మెట్టుగా పనిచేస్తుంది" అని చెప్పారు. "తెలంగాణ విజన్ మేరకు రాష్ట్రాన్ని మూడు భాగాలుగా విభజించి ఆ దిశగా కార్యక్రమాలు చేపట్టాం. ఓఆర్ఆర్ లోపలి భాగం హైదరాబాద్ మహానగరంలో 1.34 కోట్ల జనాభా జీనవ స్థితిగతులను మెరుగుపరచడానికి, కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దడానికి నగరంలోని కాలుష్య కారక పరిశ్రమలను బయటి ప్రాంతానికి తరలిస్తున్నాం. మూసీ నది ప్రక్షాళన చేపట్టాం. కాలుష్యాన్ని తగ్గించడానికి డీజిల్ ఇంధనంతో నడిచే 3 వేల ఆర్టీసీ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాలను సమకూర్చుతున్నాం. నగరంలో డీజిల్‌తో నడుస్తున్న 2 లక్షల ఆటోలను రెట్రోఫిట్టింగ్ ద్వారా మార్చడమే కాకుండా ఈవీలను ప్రోత్సహించాలన్న లక్ష్యంతో ప్రభుత్వానికి ఏటా రూ. 1500 కోట్లు ఆదాయం కోల్పోతున్నప్పటికీ ఈవీలకు జీరో టాక్స్ అమలు చేస్తున్నాం. కాలుష్యం, వరదల వంటి ఢిల్లీ, ముంబయ్, బెంగళూరు, చెన్నై లాంటి మహానగరాల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్‌కు అలాంటి దుస్థితి రాకూడదని ప్రణాళికలు సిద్ధం చేశాం. కోర్ అర్బన్ ప్రాంతాన్ని సర్వీస్ సెక్టర్‌గా, ఓఆర్ఆర్ అవతలి ప్రాంతం నుంచి రీజినల్ రింగ్ రోడ్డు లోపలి ప్రాంతం పెరి అర్బన్ ఏరియాలో మాన్యుఫాక్చరింగ్ జోన్‌గా నిర్దేశించాం.." అని తెలిపారు. "ఈ ప్రాంతంలో అవసరాలకు తగినట్టుగా విద్యుత్, నీరు, భూమి, సాంకేతిక నైపుణ్యం కలిగిన యువతను సిద్ధం చేస్తే చైనాతో పోటీ పడటానికి వీలుగా మారుతుంది. రీజినల్ రింగ్ రోడ్డు బయటి ప్రాంతం రూరల్ అగ్రికల్చర్ ఎకానమీని వృద్ధి చేయాలని సంకల్పించాం. ఇది మా విజన్. మా కమిట్‌మెంట్. మా డ్రీమ్. మా విజన్ సాధనలో రైతుల త్యాగం ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటుంది. అభివృద్ధి కోసం భూములు ఇస్తున్న రైతులకు మరింత నష్ట పరిహారాన్ని పెంచి గౌరవించాలి. వారికి మరింత భరోసా, వారిలో విశ్వాసం కల్పించాల్సి ఉంది" అని ముఖ్యమంత్రి చెప్పారు.



## ముఖ్యమంత్రిని సన్మానించిన యుగేందర్ రెడ్డి

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కొత్తకోటలో బుధవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దేవరకద్ర మున్సిపాలిటీ వైస్ చైర్మన్ యుగేంధర్ రెడ్డి కలిశారు. కొత్తకోటలో బాలికల ఉన్నత పాఠశాల ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి వచ్చిన సందర్భంగా అక్కడికి యుగేందర్ రెడ్డి వెళ్లి ముఖ్యమంత్రిని ఘనంగా సన్మానించారు. ముఖ్యమంత్రికి కరచాలనం చేసి తనకు తాను పరిచయం చేసుకున్నారు.

# నేల పరీక్షలకు ఆధారంగా ఎరువులను వినియోగించాలి

- వ్యవసాయ అధికారుల సూచన
- గ్రామాలలో ఎల్నినో అవగాహన సదస్సులు
- వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతులకు ముందస్తు జాగ్రత్తలు

**జయభేరి, దేవరకద్ర :**



నేల పరీక్షల ఆధారంగా ఎరువులను సమస్థలంగా రైతులు వినియోగించుకోవాలని రైతులకు మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండల వ్యవసాయ అధికారులు సూచించారు. దేవరకద్ర మండలం నాగారం, గూరకొండ, డోకూర్, మీన్గవానిపల్లి గ్రామాలలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం ఎల్మినో అవగాహన సదస్సులను వ్యవసాయ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో ఏర్పాటు చేసిన సదస్సులలో రైతులకు వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనలు అందజేశారు. ప్రస్తుతం ఎల్నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున, ఈ నేపథ్యంలో రైతులకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తక్కువ వ్యవధిలో పండే, కరువును తట్టుకునే పంటలు మరియు ప్రత్యామ్నాయ పంటలను రైతులు సాగు చేయాలన్నారు. నేలలో తేమ నిల్వ ఉండేలా దుక్కి, మల్చింగ్ మరియు ఇతర హేమ సంరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. నీటిని పొదుపుగా వినియోగిస్తూ వర్షపునీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నేల పరీక్షల ఆధారంగా ఎరువులను సమతుల్యంగా వినియోగించుకోవాలన్నారు. సస్యరక్షణ పద్ధతులను పాటించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు సూచించే తాజా సలహాలను అనుసరించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులందరూ అప్రమత్తంగా ఉండి వ్యవసాయ శాఖ సూచనలను పాటించి పంటలను రక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్, దేవరకద్ర క్లస్టర్ ఏఈఓ ప్రణీత, డోకూర్ ఏఈఓ శివ, నాగారం క్లస్టర్ ఏఈఓ హరీష్, గుడిబండ క్లస్టర్ ఏఈఓ శివనాయక్ లతోపాటు ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.



## నిర్ణయించిన ధరలకే యూరియా విక్రయించాలి

- వ్యవసాయ అధికారికి బిజెపి నాయకుల వినతి

**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలంలోని రైతులకు యూరియా ఎక్కువ ధరలకు విక్రయించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని స్థానిక మండల వ్యవసాయ అధికారి రాజేందర్ అగర్వాల్ ను బుధవారం బిజెపి నాయకులు కోరారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయనను కలిసి నాయకులు ఈ విషయంలో చర్చించారు. అలాగే స్థానిక పిఎసిఎస్ అధికారులతో కూడా ఈ విషయంలో నాయకులు చర్చించి యూరియాను నిర్ణయించిన ధరకే విక్రయించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి దేవరకద్ర మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, బంగారు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని కలసిన దేవరకద్ర కౌన్సిలర్ బీరప్ప



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలోని కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రానికి బుధవారం వచ్చిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దేవరకద్ర మున్సిపాలిటీ 7వ వార్డు కౌన్సిలర్ బీరప్ప పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని బీరప్ప శాలువా కప్పి సన్మానించారు. కౌన్సిలర్ బీరప్ప చెప్పిన సమస్యలపై ముఖ్యమంత్రి వెంటనే స్పందించి సమస్యల పరిష్కారానికి సహకరిస్తారని హామీ ఇచ్చినట్లు బీరప్ప తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మొదటిసారి కలవడం తనకు చాలా ఆనందాన్ని ఇచ్చిందని కౌన్సిలర్ బీరప్ప అన్నారు.

## ప్రతీ ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలి



**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 15 :**

నీరు అమూల్యమైన సంపదగా భావించి ప్రతీ ఒక్కరూ పొదుపుగా వాడుకోవాలని యాదగిరిగుట్ట మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. సీడీఎంఏ ఆదేశాల మేరకు జలశక్తి అభియాన్ క్యాచ్ ద రెయిన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం యాదగిరిగుట్ట జెడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మున్సిపల్ కమిషనర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటిని పొదుపుగా వాడుకోవాలని, ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, ఎంఈవో శరత్ యామిని, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బీర్ల అయిలయ్య క్షమాపణ చెప్పాలి



**జయభేరి, యాదగిరిగుట్ట, జులై 15 :**

మాజీ మంత్రి,సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్‌రావును విమర్శించే స్థాయి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు లేదని,వెంటనే క్షమాపణ చెప్పాలని యాదగిరిగుట్ట బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం బీఆర్ఎస్ నేతలు విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ బీర్ల అయిలయ్య సర్పంచ్ కాకముందు ఆయన ఆర్థిక, సామాజిక స్థాయి ఏంటో గుర్తు తెచ్చుకోవాలని, అధికారం చేతిలో ఉందని విర్రవీగితే ప్రజలు చూస్తూ ఊరుకోరన్నారు. సొంతంగా పాల డెయిరీ పెట్టి వ్యాపారం చేసుకుంటే తప్పేందని,చంద్రబాబుకు చెందిన హెరిటేజ్ పాలు తెలంగాణలో ఏరులై పారుతున్నా కాంగ్రెస్ నేతలు ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. కోకాపేటలో దొడ్డి కొమురయ్య కురుమ సంఘం భవనాన్ని ఆంధ్ర వ్యాపారులకు కట్టబెట్టిన విషయం వాస్తవం కాదా అని,దమ్ముంటే యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి పాదాల వద్ద ప్రమాణం చేసి చెప్పాలని సవాల్ విసిరారు. భవిష్యత్తులో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, బీర్ల అయిలయ్య అవినీతి మొత్తాన్ని బయటపెట్టి జైలుకు పంపడం ఖాయమన్నారు.

# మేడ్చల్‌లో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

- మల్లారెడ్డిపై తీవ్ర విమర్శలు
- పార్టీ ఐక్యతే విజయానికి కీలకమని పిలుపు



**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం మేడ్చల్ సర్కిల్ పరిధిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి మేడ్చల్ జిల్లా డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అధ్యక్షత వహించగా, ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయ రమణారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, ముఖ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ విజయ రమణారావు మాట్లాడుతూ పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేస్తే రానున్న హైదరాబాద్ మేయర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయావకాశాలు మెరుగ్గా ఉంటాయని అన్నారు. మేడ్చల్ నియోజకవర్గంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పూర్తి అవగాహన ఉందని, నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని తెలిపారు.

డివిజన్ అధ్యక్షుల నియామకాల విషయంలో కొన్ని చిన్నపాటి పొరపాట్లు జరిగాయని అంగీకరించిన ఆయన, వాటి వెనుక ఎలాంటి కక్షసాధింపు లేదని స్పష్టం చేశారు. భవిష్యత్తులో సింగిల్ విండో విధానంలో ఏలాంటి లోపాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సహకార సంఘాల ఎన్నికలు, వ్యవసాయ రంగానికి సంబంధించిన పదవుల్లో వ్యవసాయంపై పూర్తి అవగాహన, రైతుల సమస్యలపై అవగాహన ఉన్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. రైతులకు న్యాయం జరగాలంటే రైతు సమస్యలను అర్థం చేసుకున్న నాయకులే బాధ్యతలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మాజీ మంత్రి మల్లారెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించిన విజయ రమణారావు, ప్రజల సొమ్మును దోచుకున్న వ్యక్తిగా ఆయనను అభివర్ణించారు. అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులను అనేక ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. మేడ్చల్ కాంగ్రెస్ పార్టీలో అనుభవజ్ఞులైన నాయకులు ఎంతో మంది ఉన్నారని, జంగయ్య యాదవ్ మూడుసార్లు ఎన్నికల్లో ఓడిపోయినా ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడని కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డికి సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందని, నక్క ప్రభాకర్ ప్రజల్లో ఆదరణ కలిగిన నాయకుడని పేర్కొన్నారు. ఇలాంటి నాయకత్వం ఉన్న కాంగ్రెస్ పార్టీ ఐక్యంగా పనిచేస్తే విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో డీలిమిటేషన్ ప్రక్రియలో భాగంగా నియోజకవర్గాల పునర్విభజన జరిగే అవకాశం ఉందని, అలాగే కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలంటే ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో ప్రతి ఒక్కరికీ పదవులు ఇవ్వడం సాధ్యం కాదని, అందరూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని సూచించారు. సొంత పార్టీలో ఉంటూ ప్రత్యర్థి పార్టీలకు మద్దతు పలికే నాయకులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన ఆయన, అలాంటి వారు ఎవరైనా ఉంటే వ్యక్తిగత ప్రయోజనాల కంటే పార్టీ ప్రయోజనాల కోసం పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, డివిజన్ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్లారెడ్డిపై భూకబ్జా ఆరోపణలు

- తోటకూర వజ్రేష్ యాదవ్

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో మేడ్చల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ (జంగయ్య యాదవ్) తెలిపారు. కాంగ్రెస్ పార్టీ డివిజన్ కమిటీల నియామకాల్లో సామాజిక న్యాయాన్ని పాటిస్తూ అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యం కల్పించామని పేర్కొన్నారు. డివిజన్ స్థాయి పదవులను ఆశించిన పార్టీ సీనియర్ నాయకులకు జిల్లా కమిటీలో తగిన స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రధాన రాజకీయ ప్రత్యర్థులైన బీఆర్ఎస్, బీజేపీ పార్టీలను ఓడించేందుకు పార్టీ శ్రేణులు నడుంబిగించాలని సూచించారు. భవిష్యత్తులో జరిగే నియోజకవర్గాల పునర్విభజనలో మేడ్చల్ నియోజకవర్గం రెండు లేదా మూడు నియోజకవర్గాలుగా మారే అవకాశం ఉందని, దీంతో పార్టీ నాయకులు, కార్యకర్తలకు మరిన్ని రాజకీయ అవకాశాలు లభిస్తాయని వజ్రేష్ యాదవ్ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా గుండ్లపోచంపల్లి డివిజన్‌లోని ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన 49 ఎకరాల భూమిలో 32 గుంటలను ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆక్రమించారని ఆరోపించారు.

ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. వచ్చే వారం రోజుల్లోనూ స్పందన లేకుంటే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డితో చీకటి ఒప్పందాలు చేస్తున్న పార్టీకి చెందిన కొందరు నాయకులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన వజ్రేష్ యాదవ్, గతంలో తాను మల్లారెడ్డితో కలిసి టీడీపీ తరఫున పోటీ చేసినప్పటికీ ప్రస్తుతం ఆయన తమ రాజకీయ ప్రత్యర్థి అని స్పష్టం చేశారు. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి బీఆర్ఎస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే మల్లారెడ్డిపై ఉన్న అవినీతి, అక్రమాల అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



## శ్రీ సాయి చందన ఏపీఐ లిమిటెడ్ ఫార్మా కంపెనీలో అగ్నిప్రమాదం

**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మసిటీలో మంగళవారం రోజు రాత్రి సుమారు 12:00 గంటల ప్రాంతంలో, శ్రీ సాయి చందన ఏపీఐ లిమిటెడ్ ఫార్మా కంపెనీలోని ప్రొడక్షన్ బ్లాక్2లో అగ్నిప్రమాదం సంభవించింది. ప్రొడక్షన్ బ్లాక్2 మొదటి అంతస్తులో ఉన్న ఒక రియాక్టర్ వద్ద అకస్మాత్తుగా పొగలు రావడంతో అక్కడ విధుల్లో ఉన్న షిఫ్ట్ ఇన్‌చార్జ్ మరియు ఇతర సిబ్బంది వెంటనే స్పందించి అందర్నీ అప్రమత్తులను చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టారు. అయితే రియాక్టర్‌లో ఉన్న మిథనాల్ కారణంగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సర్వీసెస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ టెండర్లు, ఫోమ్ సహాయంతో మంటలను ఆర్పివేశారు. మంటలు ఉదయం 2:00 గంటల ప్రాంతానికి అదుపులోకి వచ్చి, ఉదయం 3:30 గంటల ప్రాంతానికి పూర్తిగా అదుపులోకి వచ్చాయి. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఒక ప్రొడక్షన్ ఇన్‌చార్జ్ ముగ్గురు కెమిస్టులు ఏడుగురు హెల్పర్లు కలిపి మొత్తం 11 మంది ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి గాయాలు గాని ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పరవాడ పోలీస్ శాఖ వారు తెలియజేసారు.

## ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సిఐటియు నాయకులు




**జయభేరి, పరవాడ:**

అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మాసిటీలో సాయి చందన కంపెనీలో జరిగిన ప్రమాద స్థలాన్ని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ శంకర్రావు, ఫార్మా సిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ బుధవారం పరిశీలించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ప్రమాదం జరగడానికి గల కారణాలు కార్మికులు ఆ సమయలోఎంత మంది ఉన్నారని యాజమాన్యంతో చర్చించి సంఘట స్థలంలో తీసుకొన్న జాగ్రత్తలు గురించి అడిగి తెలుసుకొన్నాం అని తెలియజేసారు.

## మహిళలు, బాలికల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

- మహిళలు, బాలికల భద్రతే లక్ష్యంగా అభయ అవగాహన కార్యక్రమం



**జయభేరి, పరవాడ:**

మహిళలు, బాలికల భద్రతపై అవగాహన కల్పించేందుకు అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ చేపట్టిన అభయ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా పరవాడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ లంక భాస్కరరావు ఆధ్వర్యంలో జూనియర్ కళాశాలలో మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. పరవాడ పోలీస్ స్టేషన్ సిబ్బందితో పాటు మహిళా పోలీసులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు .ఈ సందర్భంగా విద్యార్థినులకు మహిళలపై జరిగే నేరాలు, వేధింపులు, ఈవ్ టీజింగ్, స్టాకింగ్, గృహ హింస, లైంగిక వేధింపులు, బాలికలపై లైంగిక నేరాలు, సోషల్ మీడియా వేధింపులు, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికల రక్షణ కోసం అమలులో ఉన్న పోక్సో చట్టం, భారతీయ న్యాయ సంహితలోని సంబంధిత నిబంధనలు, గృహ హింస నిరోధక చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టం గురించి వివరించారు. ఒక మహిళ సురక్షితంగా ఉంటే కుటుంబం సురక్షితంగా ఉంటుందని కుటుంబం సురక్షితంగా ఉంటే సమాజం సురక్షితంగా ఉంటుంది అనే సందేశంతో మహిళలు, బాలికల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు.

## ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం



**జయభేరి, దేవరకొండ :**

స్థానిక వివేకనంద ఒకేషనల్ జూనియర్ కాలేజీ నందు ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవం సందర్భంగా అధ్యక్షుడు NVT సభ్యులతో మరియు విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసినారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీచే స్థాపించబడిన ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవం, యువతకు ఉపాధి, గౌరవప్రదమైన పని, వ్యవస్థాపకత మరియు జీవితకాల అభ్యాసం కోసం నైపుణ్యాలను అందించడంలో ఉన్న వ్యూహాత్మక విలువను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యం అని, యువత మంచి ప్రవర్తన అలవర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, భాస్కర్ రెడ్డి, వల్లమల్ల ఆంజనేయులు, A గణేష్,A గౌతమ్, సుధాకర్, రాము ,రోజా, అంజలి ,లావణ్య, రాజేష్, క్రీడాకారులు కళాకారులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## క్షమాపణతో భేరి ఈశ్వర్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

- కాంగ్రెస్‌లో గుండ్లపోచంపల్లి వివాదానికి తాత్కాలిక ముగింపు

**జయభేరి, మేడ్చల్ :**




మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి నియామకాన్ని చుట్టుముట్టిన వివాదం చివరకు రాజీ దిశగా అడుగులు వేసింది. డివిజన్ అధ్యక్ష పదవి కోసం గారిసెల సురేందర్, బండారి నరేందర్ పేర్లు డీసీసీకి సిఫారసు కాగా, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ గారిసెల సురేందర్‌ను డివిజన్ అధ్యక్షుడిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నియామకంతో అసంతృప్తికి గురైన బండారి నరేందర్ వర్గం కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసింది. అనంతరం మాజీ సర్పంచ్ భేరి ఈశ్వర్, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌తో ఫోన్‌లో మాట్లాడిన సందర్భంగా చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. దీనిపై డీసీసీ అధ్యక్షుడు తొలుత భేరి ఈశ్వర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అయితే భేరి ఈశ్వర్ విలేకరుల సమావేశం నిర్వహించి పార్టీ అంతర్గత విషయాలను బహిర్గతం చేసిన వారిని వదిలేసి తనకు మాత్రమే నోటీసులు ఇవ్వడం సరికాదని ప్రశ్నించారు. అలాగే జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నిర్వహణపై డీసీసీ అధ్యక్షుడి తీరును విమర్శిస్తూ, మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డితో వజ్రేష్ యాదవ్ చీకటి ఒప్పందాలు చేసుకున్నారని ఆరోపించారు. ఈ పరిణామాల నేపథ్యంలో భేరి ఈశ్వర్‌ను ఆరు నెలల పాటు పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు వెలువడగా, అవి సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో బుధవారం మేడ్చల్ పట్టణంలో జరిగిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి చొరవతో భేరి ఈశ్వర్, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్‌కు అందరి సమక్షంలో క్షమాపణలు తెలిపారు. ఇకపై పార్టీ క్రమశిక్షణ, నియమ నిబంధనలకు కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. దీనిపై స్పందించిన డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, భేరి ఈశ్వర్ బహిరంగంగా క్షమాపణ చెప్పిన నేపథ్యంలో ఆయనపై విధించిన సస్పెన్షన్‌ను ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో గుండ్లపోచంపల్లి డివిజన్ అధ్యక్ష పదవి వివాదంతో చెలరేగిన అంతర్గత విభేదాలకు తాత్కాలికంగా తెరపడినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

## యాదగిరీశుడికి నిత్యపూజల వైభవం

- శ్రీవారి నిత్యరాబడి రూ.14.15 లక్షలు

**జయభేరి, యాదగిరిగుట్ట :**

తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారికి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతం, అర్చనను శాస్త్రోక్తంగా నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనాలకు అనుమతించారు. శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్న భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో జరిగిన శ్రీసుదర్శన నారసింహ హోమం,నిత్య కల్యాణం, నిత్య బ్రహ్మోత్సవం, వెండి జోడి సేవ,స్వర్ణ పుష్పార్చన, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజలలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కొండపైన కొలువైన శ్రీపర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాతగుట్ట శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని ఆలయంలో జరిగిన నిత్యపూజలలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



**శ్రీనారసింహుడి నిత్యరాబడి..**

నిత్యరాబడిలో భాగంగా బుధవారం రూ.14,15,625 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ప్రధాన బుకింగ్ ద్వారా రూ.51,800, బ్రేక్ దర్శనం ద్వారా రూ.1,00,200, శ్రీసత్యనారాయణస్వామి వ్రత పూజల ద్వారా రూ.21,000, వీఐపీ దర్శనం ద్వారా రూ.1,16,550, కొండపైకి వాహన ప్రవేశం ద్వారా రూ.3,00,000, సువర్ణ పుష్పార్చన ద్వారా రూ.41,600, ప్రసాద విక్రయం ద్వారా రూ.6,55,410, కల్యాణకట్ట ద్వారా రూ .30,000తో పాటు వివిధ శాఖలు, పాతగుట్ట ఆలయం ద్వారా ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

## బావోజిల అర్చక సంఘం నూతన కమిటీ ఎన్నిక

**జయభేరి, దేవరకొండ :**



తెలంగాణ అర్చక బావోజిల జిల్లా అర్చక సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలునాయక్ కి వారి కార్యాలయం నందు బావోజిల అర్చక సంఘం ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులుగా ఎన్నిక అయినందున వారి కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం భావోజీల సమస్యలపై మంత్రి దృష్టికి తీసుకువెళ్లి వారి యొక్క సమస్యను పరిష్కరించాలని, ఇంకా రిజిస్ట్రేషన్ కానీ దేవాలయాలను రిజిస్ట్రేషన్ చేయించి బావోజిల దూపదీప పథకం వర్తింపచేసేలా సహకరించాలని ఎమ్మెల్యేకి కోరడం జరిగింది. విషయంపై ద్వారా ఎమ్మెల్యే బాలునాయక్ వెంటనే స్పందించి సంబంధిత ఎండోమెంట్ కమిషనర్ అధికారులతో మాట్లాడి వెంటనే సమస్యను పరిష్కారం చేస్తానని గిరిజన బావాజీలను అందరిని ధూప దీపం పథకం వర్తింపజేసేలా చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది.



## మతోన్మాదం దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం

- జై భారత్ ఎస్సీ పోరాట వేదిక జిల్లా అధ్యక్షుడు వెలిశాల శ్యామ్

**జయభేరి, తొర్రూర్, జులై 15 :**

మండల కేంద్రంలో జై భారత్ ఎస్సి పోరాట వేదిక జిల్లా అధ్యక్షులు వెలిశాల శ్యామ్ మహర్ మాట్లాడుతూ విజయవిహారం పత్రికాఎడిటర్ జై భారత్ వ్యవస్థాపకులు రమణమూర్తి గారిపై మతోన్మాదం ఆర్ఎస్ఎస్ గుండా బి అర్ కే చానల్లో డిబేట్ నడుస్తున్న సందర్భంగా మీడియా సాక్షిగా నిజం మాట్లాడుతున్న రమణ మూర్తి పై ఆర్ఎస్ఎస్ గుండా కషాపు రెడ్డి దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమణమూర్తి ఏదైనా విషయంపై మాట్లాడితే స్పష్టమైన వైఖరితో మాట్లాడతారని. శ్రీకృష్ణ భగవానుడి తల స్థానంలో మోడీ తలపెట్టడం అమానుషం అని హిందువుల మనోభావాలను దెబ్బతీయవద్దని అలా పెట్టిన ఫోటో చూపిస్తూ రమణమూర్తి మాట్లాడుతుంటే ఆయనపై చెప్పుతో దాడి చేయడం బిజెపి ఆర్ఎస్ఎస్ దాడిగా భావిస్తున్నామని అన్నారు. ఏదైనా ఉంటే సిద్ధాంతపరంగా ఎదురుకోవాలి తప్ప ఒక మేధావిపై ఇలా దాడి చేయడం బాధాకరమని ప్రజా సంఘాల తరఫున తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజాస్వామ్య వాదుల్లారా ఇకనైనా వేకమవుదాం బిజెపి ఆర్ఎస్ఎస్ మతోన్మాదం గుండాలను తగిన బుద్ధి చెప్తాం. దాడి చేసిన మతోన్మాది బిజెపి ఆర్ఎస్ఎస్ గుండా కషాపు రెడ్డి. తగిన బుద్ధి వచ్చేలా చేస్తామని హెచ్చరించారు.

## మన ఓటును మనమే కాపాడుకుందాం

- బిఆర్ఎస్ నాయకులు బొడ్డు గోపాల్ గౌడ్



**జయభేరి, దేవరకొండ :**

ఓటర్ల నమోదు, సవరణల విషయంలో ప్రజలు ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని, మన ఓటు హక్కును మనమే కాపాడుకోవాలని బిఆర్ఎస్ నాయకులు బొడ్డు గోపాల్ గౌడ్ పిలుపునిచ్చారు. దేవరకొండ మండల పరిధిలోని ఓటర్లను ఉద్దేశించి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓటు హక్కు అనేది ప్రజాస్వామ్యంలో అత్యంత కీలకమైన ఆయుధమని, దానిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సంబంధిత ఓటరు ఫారాన్ని (Form) పూర్తిగా పూరించాలి. పూర్తి చేసిన ఫారాన్ని వెంటనే మీ ప్రాంతంలోని బూత్ స్థాయి అధికారికి (BLO) అందజేయాలి.మీ ఓటు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించి, డిజిటల్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. ఓటు నమోదు విషయంలో అలసత్వం వహిస్తే ఓటరు జాబితాలో పేరు తొలగిపోయే ప్రమాదం ఉంది. ప్రజలు, యువత తక్షణమే స్పందించి తమ ఓటును సురక్షితం చేసుకోవాలి.

# సీనియర్ సిటిజన్లకు బ్రతికే అర్హత లేదా?

- హైకోర్ట్ ఉత్తర్వులను గౌరవించని కరీంనగర్ జిల్లా జమ్మికుంట సీఐ
- మాదిరెడ్డి రవిందర్ రెడ్డి (హార్ట్ పేషెంట్ ) శంభునిపల్లి గ్రామం, జమ్మికుంట
- మేము బ్రతికి ఉండగానే మా పేరిట ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేయమని కుతుర్లు అల్లుళ్లు కొడుతున్నారు - సహకరిస్తున్న స్థానిక జమ్మికుంట సి.ఐ






**జయభేరి, జమ్మికుంట, జులై 15 :**

వ్యవసాయ భూములను తమపేరిట పట్టాచేయలని కూతుర్లు అల్లుళ్లు, గత 9 నెలల నుండి ఇంట్లో అక్రమంగా ఉంటు కొడుతూ చంపాలని చూస్తున్నారు అని కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం శంభునిపల్లి గ్రామంకు చెందిన మాదిరెడ్డి రవిందర్ రెడ్డి (70), తండ్రి తిరుపతిరెడ్డి, మాదిరెడ్డి సుబాషిణి (67), భర్త: రవిందర్ రెడ్డి. మాకు ముగ్గురు కూతుళ్ళు 1) పెద్దిరెడ్డి రమాదేవి 2) గుడిపాట మౌనిక 3) చిట్టెటి స్వాతి అందరికి వివాహాలు జరిగిన్నాయి. మొదటి కూతురు హైదరాబాద్ లో రెండవ కూతురు హన్మకొండలో నివాసముంటున్నారు. మాకు ఉండటానికి ఇల్లు లేనందున మా చిన్న కూతురు శంభునిపల్లి గ్రామంలో కట్టుకున్న సొంత ఇంట్లో నివాసం ఉంటున్నాము. మా వృత్తి వ్యవసాయం. మాకు ఆరోగ్యం బాగాలేనందున మా వ్యవసాయ భూములు వేరేవాళ్లకి కౌలుకు ఇచ్చి వచ్చిన డబ్బులతో జీవనం సాగిస్తున్నాము. మా అన్న అయిన మాదిరెడ్డి రాజిరెడ్డి 70 సంవత్సరాల క్రితం సొంత అమ్మమ్మ అయిన వంగల మాణిక్యమ్మకి దత్తత వెళ్లాడు. మా తండ్రి అయిన తిరుపతి రెడ్డి 2020 సంవత్సరంలో చనిపోగానే ఆస్తి కోసం మాకు వున్నటువంటి భూములపై మా అన్న కేసులు వేయగా అట్టి కేసు పెండింగ్లో ఉంది. కేసు పెండింగ్ లో ఉండగా పై చెప్పిన మా కూతుళ్లు పెద్దిరెడ్డి రమాదేవి, గుడిపాటి మౌనిక, వారి భర్తలు మా ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి మమ్మల్ని కొడుతు తిడుతూ భయబ్రాంతులకు గురిచేసి ఇంట్లో నుండి గెంటివేశారు. మాకు తినడానికి తిండిలేక, ఉండటానికి గూడులేక కట్టుకోవడానికి బట్టలు లేకుండా, వైద్యానికి డబ్బులు లేక రోడ్ల మిద జీవనం వెళ్లతీస్తున్నాము. మా ఇంట్లోకి మేము వెళ్దాం అని ప్రయత్నించగా మాపై దాడి చేశారు. ప్రతి సంవత్సరం మాకు కౌలు ద్వారా వచ్చే ఆదాయము రాకుండా అడ్డుపడి స్థానిక సి.ఐ రామక్రిష్ణ కౌలుకు చేసే వ్యక్తికి ఫోన్ చేసి బెదిరించగా అతను కౌలుకు చేయలేదు. మేము సొంతంగా అయిన చేసుకుందాం అని భూమి మిదకు వెళ్లగా నా రెండవ కూతురు అయిన మౌనిక పైపు లైను, మోటరు, స్టాటరు, వైర్లు అన్ని పగలకొట్టి తీసుకెళ్లడం జరిగింది. ఇట్టి విషయం అయి ఆమెను అడగగా నా పై నా భార్యపై దాడికి దిగారు. ఇట్టి విషయమై స్థానిక పోలిసుస్టేషన్లో అధికారులకు దరఖాస్తు ఇవ్వగా ఎలాంటి చర్యలు తీసుకొలేదు.గత ఎనమిది నెలలుగా పోలీస్ స్టేషన్ కు వెళ్లినా దరఖాస్తు ఇచ్చినా ఎలాంటి ప్రయోజనం లేదు.మేము ఇట్టి విషయమై రెవెన్యూ అధికారులకు వయెవృద్దుల చట్టం కింద ఆశ్రయించగా వారు మా కూతుళ్లని నెల నెల పోషణ నిమ్మిత్తం డబ్బులు ఇవ్వమని, ఇంట్లోనే ఉండమని భూములు రిజిస్ట్రేషన్ చేయమని బెదిరించకూడదని ఉత్తర్వులు ఇచ్చారు. ఆ తర్వాత కూడా స్థానిక పోలిసులను ఆశ్రయించగా ఎలాంటి ఫలితం లేదు. అట్టి అర్డరు తీసుకొని మా ఇంటి వెళ్లగా మరల ఇద్దరు కుతుర్లు అల్లుళ్లు కలిసి దాడికి ప్రయత్నం చేసారు. చివరంగా గౌరవ హైకోర్టును ఆశ్రయించంగా డబ్ల్యూ పి నెం. 20003/2026 మాకు భద్రత కల్పించమని స్థానిక సి.ఐ కి గౌరవ హైకోర్టు ఆదేశించడం జరిగింది. ఆ తరువాత మేము తేది 1/07/2026 నాడు స్థానిక సి.ఐ ని సంప్రదించగా మాకు భద్రత కల్పించకుండ ఎలాంటి విచారణ లేకుండా మా దరఖాస్తు మూసి వేయడం జరిగింది. ఈ విషయాన్ని సిరియస్ గా తీసుకున్న న్యాయ స్థానం 09.07.2026 నాడు తిరిగి మాకు మా కూతుర్లు అల్లుళ్ల నుండి భద్రత కల్పించమని సీఐ కి ఆదేశించడం అయినది. ఈరోజు అనగా 15/07/2026 హై కోర్ట్ ఉత్తర్వులను తీసుకెళ్లి సీఐ కూ చూపించాగా అతను ఆ ఆర్డర్ కాపీ ని చూసి మా మొఖం పైన విసిరేసి బయటకు వెళ్ళండి అని గద్దరించాడు. మేము ఇచ్చిన ఆర్డర్ కాపీ ని చూసిన తరువాత రసీదు ఇవ్వమని అడుగగా ఇది పోస్ట్ ఆఫీస్ కాదు పోలీస్ స్టేషన్ అని గద్దరించాడు. గతంలో స్థానిక సి.ఐ సినియర్ సిటిజన్ లు అయిన మమ్మల్ని పొలిసు స్టేషన్ కు పిలిచి మా భూములను మా కుతుర్లకు రిజిస్ట్రేషన్ చేయమని లేకపోతే మీ మిద తప్పుడు కేసులు పెడతామని బెదిరించినాడు. ఈ భూముల పై కోర్టులో కేసు పెండింగ్లో ఉండగా మా ఇద్దరు కుతుర్లుని ప్రోత్సహించి మా తల్లి అయిన మాదిరెడ్డి ఈశ్వరమ్మ(85), భర్త లేట్ తిరుపతి రెడ్డితో తప్పుడు కేసు పెట్టించినాడు. మాకు అనుమతిస్తే రాష్ట్ర ముఖ్యమంత్రిని, హోంమంత్రిని, డైరెక్టర్ జనరల్ ఆప్ పోలిసు ను కలిసి వస్తావాలతో మా గోడు విన్నవించుకుంటామని మా మనవి. మా పై గతంలో హత్యా ప్రయత్నం చేయగా మా కుతుర్లు అల్లుళ్ల పై స్థానిక పొలిసు స్టేషన్ లో ఎఫ్.ఐ.ఆర్ 180/2026 కేసు నమోదు చేసారు. పోలీసు వారు ముందుగానే స్పందించి ఉంటే మాకు ఈ పరిస్థితి వచ్చిఉండేది కాదు. మేము బ్రతికి ఉండగానే మా పేరిట ఉన్న భూములను రిజిస్ట్రేషన్ చేయమని కొడుతున్న మరియు చంపే ప్రయత్నం చేస్తున్న మా కుతుర్లు అల్లుళ్లకు సహాకరిస్తున్న స్థానిక జమ్మికుంట సి.ఐ పై చట్టరిత్యా చర్యతీసుకోగలరు. అలాగే మాకు మా కూతుర్లు, అల్లుళ్ళ, స్థానిక సీఐతో ప్రాణ భయం ఉంది. కేవలం మొదట్లో సీఐ చెప్పినట్లుగా మా కూతుర్ల పేరు మీద భూములను రిజిస్ట్రేషన్ చేయనందుకు మా ఈ దుస్థితి వచ్చింది. కావున మాకు న్యాయం చేయగలరని మనవి.



## హామీల విషయంలో కాంగ్రెస్ విఫలం...!

- అబద్దాల హామీలతో నిరుద్యోగులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం...
- పోలీసు ఉద్యోగాలు గోవిందా..!
- నిరుద్యోగుల పట్ల అధికార పార్టీ మొండి వైఖరి....
- వెంటనే నిరుద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలి...?
- తెలంగాణ రక్షణ సేన పార్టీ షాద్ నగర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గంగాపురం "ఉమాదేవి ముదిరాజ్"

**జయభేరి, షాద్ నగర్, జులై 15 :**

హామీల విషయంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విఫలం చెందిందని తెలంగాణ రక్షణ సేన పార్టీ షాద్ నగర్ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గంగాపురం ఉమాదేవి ముదిరాజ్ అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు అనేకమైన హామీలు ఇచ్చి ప్రస్తుతం వారిని రోడ్డున వదిలేసిందని అన్నారు.కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వంపై ఆమె తీవ్రంగా మండిపడ్డారు.ఈ సందర్భంగా ఉమాదేవి ముదిరాజ్ మాట్లాడుతూ.. నిరుద్యోగులను ఆశ పెట్టి, హామీలు ఇచ్చి ప్రస్తుతం ఎలాంటి నోటిఫికేషన్ విడుదల చేయకుండా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల పట్ల మొండివైఖరి చూపుతోందని, ఇది ఏమాత్రం ప్రభుత్వానికి తగదు అని అన్నారు.

**రాజీవ్ యువ వికాస్ గోవిందా...!**

హడావిడిగా హామీలు చేసి నిరుద్యోగులను ఆదుకుంటామనీ యువ వికాసం పేరిట యువతను మోసం చేసింది అన్నారు. అనేకసార్లు నిరుద్యోగులు ఎన్ని వినతులు చేసిన విని విననట్టుగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తుందని అన్నారు.

**ఉద్యోగ నోటిఫికేషన్లు గోవిందా...!**

ఉద్యోగాల ఊసు లేకుండా అబద్దాల హామీతో నిరుద్యోగులను నడిరోడ్డున వదిలేసిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, నిరుద్యోగులు అంటే కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని అన్నారు. అబద్ధాల హామీలతో నిరుద్యోగుల అండతో గెలిచిన కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో నోటిఫికేషన్లు అని రోజుల తరబడి కాలయాపన చేస్తూ నిరుద్యోగుల ఉసురు పోసుకుంటుందని అన్నారు. త్వరలో కాంగ్రెస్ పార్టీ కుప్పకూలిపోవడం ఖాయమని, రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగుల గొంతును అణచివేస్తున్న అధికార పార్టీ, తొందరలోనే ప్రతిపక్షంగా మారుతుందని అన్నారు. తక్షణమే నిరుద్యోగులకు ఇచ్చిన హామీల ప్రకారం జాబ్ క్యాలెండర్, అదేవిధంగా సంబంధిత శాఖలో ఖాళీగా ఉన్న అన్ని నోటిఫికేషన్లు విడుదల చేయాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిచో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



## పేకాట ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు

**జయభేరి, మేడిపల్లి :**

బోడుప్పల్ లోని నార్త్ బాలాజీ హిల్స్లో, SI. A. రవి కుమార్, PC 11460 రాఘవేంద్రతో కలిసి తేదీ 15.07.2026 నాడు పెట్రోలింగ్ చేయుచుండగా.. సమాచారం మేరకు ప్లాట్ నెంబర్ 54లో రైడ్ చేయగా అక్కడ ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతూ కనిపించారు. వారి వివరాలు 1. భోగంపేట నర్సిరెడ్డి (45), 2. చిత్రీ రాంబాబు (48), 3. బద్దం మైపాల్ రెడ్డి (58), 4. అడెల్లా (41), 5. అయ్యప్ప రెడ్డి (76)గా గుర్తించి.. వారి నుండి రూ. 20,300/, ఐదు స్మార్ట్ ఫోన్లు, రెండు సెట్ల పేక ముక్కలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనైనధి.

## జమ్మూలో బీజేపీ వర్సెస్ నేషనలిస్ట్ కాంగ్రెస్



**జయభేరి, శ్రీనగర్, జూలై 15 :**

జమ్మూ కాశ్మీర్ లో రాజకీయాలు ఒక్కసారిగా మారిపోయాయి. బీజేపీ తన పార్టీ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసి, తన ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని చూస్తున్నాయని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సంచలన ప్రకటన చేశారు. "ఆపరేషన్ లోటస్" పేరుతో తమ ప్రభుత్వాన్ని అస్థిరపచాలని చూస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు.బీజేపీకి చెందిన ఓ కీలక నేత, సుప్రీంకోర్టు న్యాయవాది మా పార్టీ ఎమ్మెల్యేను రహస్యంగా కలిశారు. పార్టీ మారితే రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్ల నగదు, మంత్రి పదవి ఇస్తామని, జమ్మూ కశ్మీర్‌కు పూర్తి రాష్ట్ర హోదా కల్పిస్తామని ఆశ చూపారు. కానీ మా ఎమ్మెల్యేల విశ్వాసాన్ని, నిబద్ధతను వారు కొనలేకపోయారు. రూ.100 కోట్లు ఇచ్చినా నేషనల్ కాన్ఫరెన్స్ నేతలు అమ్ముడుపోరు. బలహీనులుగా భావించి వెనుక ద్వారం గుండా అధికారంలోకి రావాలని బీజేపీ చూస్తోంది" అని తీవ్రంగా విమర్శించారు.జమ్మూ కాశ్మీర్ సీఎం ఒమర్ తమపై లేనిపోని అభాండాలు మోపుతున్నారని బీజేపీ మండిపడింది. రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేస్తామని హెచ్చరిస్తూ సీఎం ఒమర్ కి బీజేపీ లీగల్ నోటీసులు కూడా పంపింది. ఒమర్ అబ్దుల్లా ఆరోపణలను బీజేపీ ఖండించింది. ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు పూర్తిగా నిరాధారమైనవని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది పేర్కొన్నారు. తమపై చేసిన ఆరోపణలకు వెంటనే ఆధారాలు చూపాలని, లేకపోతే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ తర్వాత బీజేపీ తరఫున ఒమర్ అబ్దుల్లాకు అధికారిక లీగల్ నోటీసు పంపారు. ఆరోపణలను నిరూపించలేకపోతే లేదా బహిరంగ క్షమాపణ చెప్పకపోతే రూ.100 కోట్ల పరువు నష్టం దావా దాఖలు చేస్తామని నోటీసులో పేర్కొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు.. కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం

**జయభేరి, మేడ్చల్ :**



మేడ్చల్ నియోజకవర్గంలోని మేడ్చల్ డివిజన్ పరిధిలోని జి ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్ లో మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశానికి ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్,పెద్దపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ విజయ రామారావు,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి శ్రీ తోటకూర వజ్రేష్ (జంగయ్య) యాదవ్,మేడ్చల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు శ్రీ మలిపెద్ధి సుధీర్ రెడ్డి గారు,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రా రెడ్డి గారు,రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ నక్క ప్రభాకర్ గౌడ్ గారు విచ్చేసి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పార్టీ బలోపేతం కృషి చేయాలని తెలియజేసారు.ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ గారు మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లో కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగరవేయడమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిలబడే పార్టీ అని,ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ 297 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నడికొప్పు నాగరాజు (చాపరాజు) ముదిరాజ్, 298 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, 299 డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గర్మాల సురేందర్ ముదిరాజ్, అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ శిరీష కృష్ణారెడ్డి,మేడ్చల్ అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రేగు రాజు కురుమ, దుర్గం శివ శంకర్ ముదిరాజ్, మేడ్చల్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు చీర్ల రమేష్ కురుమ, జాకట దేవరాజ్, కౌడే మహేష్ కురుమ, మర్రి నర్సింహారెడ్డి, వీరమల్ల శ్రావణ్ కుమార్ గుప్తా,బత్తుల మధుకర్ యాదవ్,నారెడ్డి రవీందర్ రెడ్డి,సాటే నరేందర్ వంజరి, మేడ్చల్ సొసైటీ డైరెక్టర్ వెంకట్ రాంరెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, నడికొప్పు రంజిత్ ముదిరాజ్, రామన్నగారి రాఘవేందర్ గౌడ్, గోమారం బాల్ రెడ్డి, కనకాల శివ కుమార్ (బిపిటి రాజు), బొక్క రఘుపతి రెడ్డి, దుర్గం వెంకటేష్ ముదిరాజ్, మేకల రాజశేఖర్ రెడ్డి (బబ్లూ), బండి శ్రీనివాస్ గౌడ్, తొంట యాదయ్య, నడికొప్పు బాల మల్లేష్ ముదిరాజ్, పెగుడ శ్యాంరావ్, తొంట సుధాకర్, హనుమంత్ రెడ్డి, దుబ్బ రామస్వామి ముదిరాజ్, భూపాల్ రెడ్డి, రామన్నగారి సంతోష్ గౌడ్, సత్తిరెడ్డి, శివ, రామకృష్ణ, పానుగంటి మహేష్ కుమార్, మహమ్మద్ ఆరీఫ్, విభూది యాదగిరి, చంద్రయ్య గౌడ్, ఆటో విజయ్, లక్ష్మణ్ గౌడ్, మోహన్ రెడ్డి, ప్రభు ముదిరాజ్, శ్రీరాం రెడ్డి, గణేష్, వేముల రంజిత్ రెడ్డి, కటిక వినయ్, మహిళా నాయకురాలు ప్రేమలత, మల్లీశ్వరి, వినోద, శ్యామల, రేణుక, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండాలి

**జయభేరి, మేడిపల్లి :**



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్-10, బోడుప్పల్ డివిజన్-11లోని లక్ష్మీనగర్, పద్మావతి కాలనీలలో నిర్వహిస్తున్న ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (SIR)లో భాగంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లను బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్మక్ కళ్యాణ్ కుమార్, చెంగిచెర్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొగుల దిలీప్ రెడ్డి, బోడుప్పల్ మాజీ కార్పొరేటర్ కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు హరినాథ్ రెడ్డి, బోడుప్పల్ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు ఆసర్ల బీరప్, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బద్దుల శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ నాయకులు అంబాల అరవింద్, ముంగలి సురేష్, రాహుల్, శివ సాయి చంద్, బూత్ లెవల్ అధికారులు (BLOలు) రాజేష్, కుమార్, సరిత, సీతామహాలక్ష్మి బూత్ లెవల్ ఏజెంట్లు (BLAలు) కలిసి సందర్శించి కార్యక్రమ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు హెల్ప్ డెస్క్‌లను సందర్శించి ఓటర్లకు SIR కార్యక్రమం పై అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ పేరు ఓటరు జాబితాలో ఉందో లేదో ధృవీకరించుకోవాలని, కొత్తగా నమోదు చేసుకోవాల్సిన వారు, అలాగే పేరు, చిరునామా, వయస్సు, ఫోటో తదితర వివరాల్లో సవరణలు అవసరమైన వారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రజలందరూ ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు.

## మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి హౌస్ అరెస్ట్

**జయభేరి, నిజామబాద్ :**

మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తలపెట్టిన నిరాహార దీక్షను పోలీసులు అడ్డుకున్ఆరు. ఈ నేపథ్యంలో అయనను హౌస్ అరెస్టు చేసారు. నియోజకవర్గంలో ఉదయం నుంచి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను ఎక్కడికక్కడ గృహనిర్బంధాలతో పాటు అరెస్టు చేసి పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. భీంగల్ మున్సిపాలిటీ అభివృద్ధితో పాటు 100 పడకల ఆసుపత్రి నిర్మాణం, ఆర్టీసీ డిపో పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా నిరాహార దీక్ష చేయాలని ప్రశాంత్ రెడ్డి నిర్ణయించారు.


## భవిష్యత్తులో విద్యార్థులకు మరింత సహకారం అందించాలి



**జయభేరి, ఉప్పల్ :**

బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ ప్రతినిధి నళిని రఘు రామన్ తో ఉప్పల్‌కు సంబంధించిన వీసా, విద్యార్థుల సమస్యలపై చర్చించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ రోడ్ నెం.1లో ఉన్న తాజ్ డెక్కన్ హోటల్‌లో బ్రిటిష్ డిప్యూటీ హై కమిషన్ ప్రతినిధి నళిని రఘు రామన్ గారిని ఉప్పల్ ఎమ్మెల్యే శ్రీ బండారి లక్ష్మారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన విద్యార్థులకు సంబంధించిన వీసా అంశాలు, ఉన్నత విద్య కోసం విదేశాలకు వెళ్లే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలు, అలాగే భవిష్యత్తులో విద్యార్థులకు మరింత సహకారం అందించే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఉప్పల్ నియోజకవర్గ విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ కృషి చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో గంధం నాగేశ్వర్ రావు జెట్టా కిషోర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## SIR కార్యక్రమంలో భాగంగా పరిశీలిస్తున్న తహశీల్దార్ విజయలక్ష్మి



**జయభేరి, చింతపల్లి :**

తీదేడు గ్రామంలో ఓటర్ సవరణ ప్రక్రియ బిల్ ఓలు ఏవిదంగా పని చేస్తున్నారో తనిఖీ చేసి పరిశీలించిన చింతపల్లి తహశీల్దార్ విజయలక్ష్మి తొందరగా పూర్తి చేయాలని కోరారు మందకొడిగా కొనసాగుతున్నది తెలిపారు.

## ఇదే నా డైట్ సీక్రెట్..



సోనాలి రోజంతా ఏమీ తినకుండానే గడి పేస్తుంది. ఆమె భోజన సమయాలు నిర్ణ యించబడి ఉంటాయి. ఆమె రోజుకు ఒక టిన్నర సార్లు లేదా కొన్నిసార్లు రెండుసార్లు మాత్రమే తింటుంది. చాలా వరకు, ఆమె దినచర్య ఇలాగే ఉంటుంది. ఆమె తాను తినే ఆహారం పరిమాణం విషయంలో కూడా చాలా జాగ్రత్తగా ఉంటుంది. ఆమె తన ప్లేటులో తనకు అవసరమైనంత ఆహా రాన్ని మాత్రమే తీసుకుంటుంది. చాలా మందికి భోజనాల మధ్యలో చిరుతిండి తినే అలవాటు ఉంటుంది. కానీ సోనాలి వీటన్నింటికి దూరంగా ఉంటుంది. ఆమె తక్కువగా తింటుంది, కానీ ఆలోచించి, సమతుల్యంగా తింటుంది. “ఇదే నాకు ఉత్తమమైనది,” అని ఆమె చెప్పింది. మధ్యంతర ఉపవాసం ఏమి తినాలి అనే దానికంటే ఎప్పుడు తినాలి అనే దానిపై ఎక్కువ దృష్టి పెడుతుంది.మధ్యంతర ఉపవాసంలో తినడానికి , ఉపవాసం ఉం డటానికి ఒక నిర్దిష్ట సమయం ఉంటుంది. ఇది ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడానికి , బరువును నియంత్రించడానికి సహాయ పడుతుంది. సోనాలి బింద్రే ఇంకా ఇలా అన్నారు, “ప్రతి ఒక్కరి శరీరం భిన్నంగా ఉంటుంది. అందువల్ల, మీరు మీ శరీరా నికి , జీవనశైలికి సరిపోయే ఆహారాన్ని అనుసరించాలి. అని అన్నరు. 2018లో, ఆమెకు నాలుగో దశ మెటాస్టాటిక్ క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయింది. న్యూ యార్క్‌లో సుదీర్ఘ చికిత్స , కీమోథెరపీ తర్వాత, ఆమె క్యాన్సర్‌ను విజయవంతం గా జయించారు.




## ఆదివారం ముగింపు వేడుక..

### ఆస్కార్, సినీ సెలబ్రిటీలకు ఆహ్వానం..!

ఫిఫా వరల్డ్ కప్ తుది అంకానికి చేరడంతో ముగింపు వేడుకలపై నిర్వాహకులు దృష్టి సారించారు. 48 జట్లతో మొదలైన ఈ మెగా టోర్నీ జూలై 19 ఆదివారంతో పూర్తి కానున్నం దున.. అభిమానులను రంజింపజేసేందుకు భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. న్యూయా ర్క్‌లోని న్యూ జెర్సీ స్టేడియంలో జరుగనున్న ‘క్లోజింగ్ సెరెమొనీ’లో హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్, ఇంటర్నెట్ సెన్సేషన్ ‘ఐషోస్పీడీ’ సహా పలువురు సినీ సెలబ్రిటీలు పాల్గొననున్నారు. సాకర్ అభిమానులను ఉర్రూతలూగిస్తున్న ఫిఫా వరల్‌డ్‌కప్ విజేత ఎవరో ఆదివారంతో తే లిపోనుంది. ఫ్రాన్స్‌ను చిత్తుచేసిన స్పెయిన్‌ను ఢీకొట్టే జట్టేదో రెండో సెమీఫైనల్‌లో ఖరారు కానుంది. దాంతో, టైటిల్ పోరుకు ముందు ఆనావాయితీ అయిన ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించాలని భావిస్తోంది. న్యూ జెర్సీ స్టేడియంలో మ్యాచ్‌కు 90 నిమిషాల ముందు ఆటగాళ్లతో పాటు అభిమానులను అలరించేందుకు పలువురు సినీ సెలబ్రిటీలను ఆహ్వానించింది. ఆస్కార్ అవార్డు విజేత, గాయని జెన్నిఫర్ హడ్సన్‌అమెరికా జాతీయ గీతాన్ని ఆలపించనుంది. ఆస్కార్ విజతే, అమెరికా నటుడు టామ్ క్రూజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలువ నున్నాడు. రాబీ విలియమ్స్(ఇంగ్లిష్ గాయకుడు, గేయ రచయిత), లారా పాసిని(ఇటలీ పాప్ సింగర్), నికొలె షెర్జింజర్(అమెరికా గాయని)లు తమ గాత్రంతో ఫ్యాన్స్‌ను సంగీతసాగ రంలో ఓలలాడించనున్నారు. ఇంటర్నెట్ సంచలనం యూట్యూబర్ ఐషోస్పీడ్ తన మార్క్ హావభావాలతో సందడి చేయనున్నాడు. ‘ముగింపు వేడుకల్లో సంగీతం, సంస్కృతి, ఫుట్‌బాల్ థీమ్‌తో టోర్నమెంట్ మొత్తాన్ని ప్రతిబింబిస్తామ’ని వరల్‌డ్‌కప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ హీమో షిర్గి వెల్లడించాడు. ఈ ముగింపు వేడుకల్లో మెరిసే తారలు, ప్రముఖుల జాబితాలో మరొకొందరు పేర్లు చేరే అవకాశముందని సమాచారం.

## నిరీక్షణకు తెర 23న వస్తున్న ‘జన నాయగన్’




తమిళనాడు సీఎం, అగ్ర కథానాయకుడు దళపతి విజయ్ అభిమానుల సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. సెన్సార్ చిక్కుల్లో పడి విడుదల విషయంలో వరుస వాయిదాలు ఎదుర్కొన్న ‘జన నాయగన్’ సినిమా విడుదల తేదీ ఖరారైంది. ఈ నెల 23న భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు.

## ఘనంగా "ఆపరేషన్ అరుణారెడ్డి" సినిమా ప్రీ రిలీజ్



ప్రముఖ రచయిత, నటుడు పోసాని కృష్ణమురళి నిర్మిస్తూ, దర్శకత్వం వహిస్తూ ప్రధాన పాత్రలో నటిస్తున్న సినిమా "ఆపరేషన్ అరుణారెడ్డి". ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, మాటలు, పాటలు, ఎడిటింగ్ బాధ్యతలు కూడా పోసాని కృష్ణమురళి వహిస్తుండటం విశేషం. హిందోళ చక్రవర్తి, కాజల్ శర్మ, ఆయేషా ఖాన్, బీజేపీ నేత రఘునందన్ రావు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ నెల 17న "ఆపరేషన్ అరుణారెడ్డి" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. మంగళ వారం సాయంత్రం హైదరాబాద్ లో ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో
హీరోయిన్ హిందోళ చక్రవర్తి మాట్లాడుతూ "ఆపరేషన్ అరుణారెడ్డి" సినిమాలో ప్రధాన పాత్రలో నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. ఈ సినిమా మీ అందరికీ నచ్చేలా ఉంటుంది. నవ్విస్తుంది, ఆలోచింపజేస్తుంది, మన సొసైటీని రిఫ్లెక్ట్ చేసేలా ఉంటుంది. ఈ నెల 17న థియేటర్స్ కు వెళ్లి మా సినిమా చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నా. అన్నారు. ప్రొడ్యూసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ పోసాని కృష్ణమురళి నాకు మంచి మిత్రులు. ఆయన ఈ ప్రాజెక్ట్ గురించి చెప్పినప్పుడు నేనూ భాగమవ్వాలని ముందుకొచ్చా. మా కాంబినేషన్ లో ఇక నుంచి ఏడాదికి రెండు సినిమాలు చేయబోతున్నాం. "ఆపరేషన్ అరుణారెడ్డి" ఒక మంచి మూవీ. మీ అందరూ చూసి ఆదరించాలని కోరుకుంటున్నా. అన్నారు. నటుడు, దర్శక, నిర్మాత పోసాని కృష్ణమురళి మాట్లాడుతూ మా సినిమా ఇంత త్వరగా షూటింగ్ చేసుకుని రిలీజ్ కు వస్తోందంటే కారణం నా మిత్రుడు శ్రీనివాస్. ఆయన అందించిన సహకారం వల్లే అనుకున్న టైమ్ కు సినిమాను రిలీజ్ చేస్తున్నా. నేను రైటర్ గా వంద చిత్రాలు రాశాను. నటుడిగా వందలాది చిత్రాల్లో నటించాను. దర్శక నిర్మాతగా సినిమాలు తెరకెక్కించాను. నేను చేసిన అన్ని చిత్రాల్లో "ఆపరేషన్ అరుణారెడ్డి" కు బెస్ట్ స్క్రీన్ ప్లే ఇచ్చానని చెప్పగలను. ఈ సినిమా రూపొందించిందుకు గర్వంగా ఉంది. సినిమా ప్రారంభం నుంచి చివరి దాకా ఏం జరుగుతుందో ఊహించలేరు. ఈ సినిమాలో ఒక్క బూతు గానీ, ఒక్క అసభ్యమైన సన్నివేశం గానీ ఉండదు. ఎంతో సిన్సియర్ గా ఈ సినిమాను రూపొందించాను. "ఆపరేషన్ అరుణారెడ్డి" సినిమా ప్రేక్షకులందరికీ బాగా నచ్చుతుందని నమ్ముతున్నా. అన్నారు.
నటీనటులు పోసాని కృష్ణమురళి, రఘునందన్ రావు, హిందోళ చక్రవర్తి, కాజల్ శర్మ, ఆయేషా భాను సాయి మణికంఠ, తదితరులు.



## 41 ఏళ్ల వయసులో రెండో పెళ్లి..

బాలీవుడ్ ఇండస్ట్రీలో ఆమె మంచి క్రేజ్ సంపాదించుకున్న హీరోయిన్. ముఖ్యంగా బుల్లితెరపై తనదైన ముద్ర వేసింది. అయితే 41 ఏళ్ల వయసులో మరో పెళ్లి చేసుకోవడానికి రెడీ అయ్యింది. ఆమె మరెవరో కాదు.. జెన్నిఫర్ వింగెట్. పలు సీరియల్స్ ద్వారా హిందీ సినీ రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. హిందీ టెలివిజన్ ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన నటీమణులలో ఒకరు. కానీ గత కొన్ని సంవత్సరాలుగా ఆమె తన వ్యక్తిగత జీవితం కంటే తన కెరీర్‌పైనే ఎక్కువ దృష్టి సారించారు. బూమ్ బూమ్, కసౌతీ జిందగీ కే, క్యా హోగా నిమ్మో కా, కహీ తో హోగా, సరస్వతీ చంద్ర, బేహద్ వంటి సీరియల్స్‌లో జెన్నిఫర్ నటన ఆమెకు అపారమైన ప్రజాదరణను తెచ్చిపెట్టింది. అయితే కెరీర్ మంచి ఫాంలో ఉండగానే.. ‘దిల్ మిల్ గయే’ చిత్రంలో తన సహనటుడైన కరణ్ సింగ్ గ్రోవర్‌తో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. కొన్నాళ్లు ప్రేమలో ఉన్న వీరిద్దరు 2012లో వివాహం చేసుకున్నారు. కానీ పెళ్లైన రెండేళ్లకే మనస్పర్థలతో ఇద్దరూ 2014లో విడాకులు తీసుకున్నారు. డివోర్స్ తర్వాత కరణ్ సింగ్ నటి బిపాషా బసును వివాహం చేసుకు న్నారు. కానీ జెన్నిఫర్ మాత్రం పూర్తిగా తన కెరీర్ పై దృష్టి పెట్టారు. దాదాపు 12 సంవత్సరాలుగా ఒంటరిగానే ఉంటూ వరుస సినిమాలు, సీరియల్స్ ద్వారా అలరిస్తుంది. తాజాగా ఆమె రెండో పెళ్లి చేసుకోబోతుందనే టాక్ నడుస్తుంది. చాలా ఏళ్లుగా ఒంటరిగా ఉన్న ఈ నటి ఇప్పుడు కొత్త జీవితాన్ని ప్రారంభించాలని నిర్ణయించుకుందని టాక్ నడుస్తుంది. నివేదికల ప్రకారం జెన్నిఫర్ సింగపూర్ వ్యాపారవేత్త విలియం ఇష్మాయెల్‌ను వివాహం చేసుకోబోతుందని ప్రచారం నడుస్తుంది. వీరిద్దరి వివాహం జూలై 16న జరగనున్నట్లు టాక్. యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఈ వివాహం చాలా ప్రైవేట్‌గా జరుగుతుందని, ఈ వేడుకకు కేవలం కుటుంబ సభ్యులు, సన్నిహితులు మాత్రమే హాజరవుతారని సమాచారం.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889**. **PRGI No: TGTEL/25/A0314**. email: **jayabherinews@gmail.com**, **www.jayabheridaily.com**